ఎన్ఐఏ చేతిలోకి రాయచోటి ఉగ్ర కేసు

- సీనియర్ ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో విచారణ
- త్వరలో మరికొందరి అరెస్టు?



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో అన్నమయ్య జిల్లా పోలీసులు పట్టుకున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉగ్రవాదుల కేసు విచారణ జాతీయ విచారణా సంస్థ (ఎన్ఐఏ) చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం. ఎన్ఐఏలో ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో ఈ విచారణ జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఉగ్రవాదులతో సన్నిహిత సంబంధాలున్న కొందరిని సైతం విచారణాధికారులు అదుపులోకి తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో గత రెండు నెలలుగా స్తబ్దుగా ఉన్న ఉగ్రవాదుల కేసు మళ్లీ తెరపైకి రానుంది.

రాయచోటి పట్టణంలో జూలై 1వ తేదీ అర్ధరాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన అబూబక్కర్ సిద్దిక్ అలియాస్ అమానుల్లా, మొహమ్మద్ అలీ అలియాస్ మన్సూర్ అనే ఇద్దరు అల్ ఉమ ఉగ్రవాదులను అరెస్టు చేశారు. 1995 నుంచి ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ఉగ్రవాదులు సుమారు 30 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో మారు పేర్లతో నివశిస్తూ చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఉండేవారు. 1995 నుంచి 2011 వరకు చెన్నై, కర్నాటక, కేరళ రాష్ట్రాలలో బీజేపీ అగ్రనేత ఎల్‌కె అద్వానీ రథయాత్ర సందర్భంగా మదురైలో జరిగిన బాంబుపేలుడు, తమిళనాడులోని ఎగ్మూర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన బాంబుపేలుడు వంటి అనేక బాంబుపేలుళ్ల కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా పోలీసులు, తమిళనాడు ఏటీఎస్ పోలీసుల సంయుక్త దాడుల్లో ఇద్దరు ఉగ్రవాదులు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకున్న తర్వాత ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు స్పందించి ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా వీరి ఇళ్లలో పెద్ద ఎత్తున బాంబులు, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకుని దేశానికి పెద్ద ముప్పును తప్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదుల భార్యలను సైతం అరెస్టు చేశారు. ఈ మేరకు రాయచోటి అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఉగ్రవాదులు, ఉగ్రవాదుల భార్యలపైన ఉగ్రవాద కార్యకలాపాల ఆరోపణలపై కేసులు నమోదు చేశారు. ఉగ్రవాదులు దొరికిన తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలోని విచారణా సంస్థలు ముమ్మరంగా విచారణ చేపట్టాయి. ఉగ్రవాదులు నివాసం ఉన్న ఇళ్లను పలుమార్లు పరిశీలించాయి. ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్న కరుడుగట్టిన ఉగ్రవాదులు ఇద్దరు 30 సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో ఉంటూ ఎవరికీ అనుమానం రాకుండా ఎలా ఉన్నారు? స్థానికులు ఎవరైనా వీరికి సహాయం చేశారా? అమాయక యువకులు ఎవరైనా వీరి విషపు మాటలకు వలలో చిక్కారా? వీరికి ఆర్థికసాయం అందించింది ఎవరు? అనే కోణంలో విచారణ చేశారు. తమిళనాడుకు చెందిన వీరికి ఇక్కడి స్థానిక మహిళలతో ఎవరు పెళ్లి జరిపించారు.? ఇల్లు అద్దెకు ఎవరు ఇప్పించారు? ఫోన్ సిమ్‌కార్డులు ఎవరు సమకూర్చారు? ఆ సిమ్‌కార్డులు ఎవరి పేరు మీద ఉన్నాయి? అని తాము అదుపులోకి తీసుకున్న పలువురిని విచారించారు. అదుపులోకి తీసుకున్న అందరినీ విడిచిపెట్టారు. దీంతో ఇక ఈ విచారణ పూర్తయినట్టే అని అందరూ అనుకున్నారు. అయితే ఇప్పుడు విచారణా బాధ్యతలను జాతీయ స్థాయి దర్యాప్తు సంస్థ చేపట్టింది.



ఎన్ఐఏ చేతుల్లోకి విచారణ

ఇప్పుడు రాయచోటి ఉగ్రవాదుల కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణా బాధ్యతను తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎన్ఐఏలోని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి పర్యవేక్షణలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే తమిళనాడు జైలు నుంచి ఇద్దరు ఉగ్రవాదులను ఎన్ఐఏ బృందం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రాయచోటి పట్టణానికి చెందిన కొందరిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ముఖ్యంగా ఉగ్రవాదులకు నిత్యం అందుబాటులో ఉన్న వాళ్లు ఎవరు? ఆర్థికంగా సాయం అందించిన వాళ్లు ఎవరు? ఏదైనా న్యాయపరమైన సాయం చేసిన వాళ్లు ఎవరు? అనే విషయమై దర్యాప్తు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఎన్ఐఏ రాయచోటి పట్టణంలో కొందరిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

రూ.9.15 కోట్ల ఆదాయమే లక్ష్యం

- మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ గోపి



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ గోపి

ములకలచెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 10 వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.9.15 కోట్లు ఆదాయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పసుపులేటి గోపి తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది లక్ష్యం రూ.9.15 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.5 కోట్లు వచ్చిందన్నారు. ములకలచెరువు మార్కెట్ ద్వారా రూ.1.04 కోట్లకు ఇప్పటి వరకు రూ.74 లక్షలు వచ్చిందన్నారు. 60 శాతం లక్ష్యం పూర్తయిందన్నారు. మార్కెట్‌లో రైతు విశ్రాంతి భవనం, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం, కార్యాలయం నవీకరణ కోసం రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. తనిఖీల్లో మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ బాలాజీ, సిబ్బంది రాజు, సునీల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోలకు ప్రమోషన్, పోస్టింగులు

కలికిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదోన్నతులు పొందిన పలువురు ఎంపీడీవోలకు కడప, అన్నమయ్య జిల్లాల్లో వివిధ రకాల పదవుల్లో నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు జిల్లా పంచాయతీ అధికారిగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న డీఎల్డీవో జి.వెంకటనాయుడుకు పదోన్నతి ఇచ్చి అన్నమయ్య జిల్లా అదనపు ఈజీఎస్ అధికారిగా నియమించారు. కర్నూలు డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న వైపీ రమణారెడ్డిని పులివెందుల డ్వామా ఏపీడీగా నియమించారు. ఓబులవారిపల్లె ఎంపీడీవో ఎ.మల్‌రెడ్డికి పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లా డ్వామా ఏపీవో (ఎంఅండ్‌ఈ)గా నియమించారు. కడప జిల్లా దువ్వూరు ఎంపీడీవో సి.రామకృష్ణయ్యకు పదోన్నతి కల్పించి సత్యసాయి జిల్లా పెనుగొండ డీఎల్డీవోగా నియమించారు. సంబేపల్లె ఎంపీడీవో ఎస్.రామచంద్రకు పదోన్నతి కల్పించి చిత్తూరు జిల్లా కుప్పం డీఎల్డీవోగా నియమించారు. హిందూపురం ఎంపీడీవో వి.సరస్వతిని కడప జిల్లా డ్వామా కార్యాలయం ఏవోగా నియమించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శనివారం ఆదేశాలు జారీ చేశారు.

నీటి ఎద్దడికి చెక్‌డ్యాం

- చెక్‌డ్యాంలు లేకపోవడంతో గుంజనేరులో వృథాగా పోతున్న నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు

6

మదనపల్లెను ఎప్పటికీ మరువలేను 6
మంత్రి సత్యకుమార్

CTBTA DATE 07-09-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 110/- డ్రెస్డ్ స్కిన్‌తో 203/-
రిటైల్ లైవ్ బర్డ్ 135/- స్కిన్‌లెస్ 228/-

బొప్పాయి టన్నుకు రూ.8 వేలు ఇవ్వాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ భావన



చిట్వేలిలో బొప్పాయి తోటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



రైల్వేకోడూరులో దళారులు, మార్వాడీలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

రైల్వేకోడూరు/చిట్వేలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతులకు టన్ను రూ.8 వేలు ఇవ్వాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్, రాజంపేట సబ్ కలెక్టర్ భావనలు తెలిపారు. రెండు రోజులుగా బొప్పాయి రైతులు సమ్మె నిర్వహించడంతో శనివారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి మండలంలో బొప్పాయి తోటలను కలెక్టర్ పరిశీలించి రైతులతో ధరల విషయమై చర్చించారు. అనంతరం చిట్వేలి, రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయాల్లో స్థానికంగా ఉండే రైతులు, దళారులతో ధరల విషయమై జిల్లా ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారులతో కలెక్టర్, సబ్ కలెక్టర్ వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఢిల్లీ, రాజస్థాన్, పాట్నా, బీహార్ తదితర రాష్ట్రాలలో ప్రస్తుత మార్కెట్ ధరలపై నివేదికలు తెప్పించామని కలెక్టర్, సబ్ కలెక్టర్‌లు తెలిపారు. రెండు రోజుల క్రితం రైతులకు టన్ను రూ.5 వేలు ఇచ్చామని ప్రస్తుతం రూ.7 వేలు ఇస్తున్న వ్యాపారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఏఎంసీ మార్కెట్లో ధరలు బాగా ఉన్నాయని దళారులు, రైతులు, అధికారులు కలిపి ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ప్రతిరోజూ మార్కెట్‌కు అనుగుణంగా ధరలు నిర్ణయించాలని వారు తెలిపారు. మొదటి కోత కాయలకు టన్ను రూ.8 వేలు ఇవ్వాలని, రెండు కోత కాయలు టన్ను రూ.7 వేలు ఇవ్వాలని తెలపగా ఇందుకు దళారులు సుముఖం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తో పది శాతం రైతులే లబ్ధి పొందుతారని 90 శాతం రైతులు నష్టపోతారని దళారులు అధికారులకు విన్నవించారు. త్వరలో దసరా ఉత్సవాలు ప్రారంభం అవుతాయని దీంతో ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని దళారులు అధికారులకు తెలిపారు. దీంతో సోమవారం నుంచి రైతులకు కనీస మద్దతు ధర టన్ను రూ.8 వేలు ఇవ్వాలని దళారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిణి, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, రైల్వేకోడూరు, చిట్వేలి తహసీల్దార్లు కోనేటి అమర్‌నాథ్, స్పందన, రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ కార్యదర్శి లక్ష్మీకాంత్, రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల కార్యకర్తకు ఉన్నత స్థానం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

రాజంపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ కలిగి పార్టీ నియమావళికి అనుగుణంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడే కార్యకర్తను బీజేపీ ఉన్నత స్థానానికి తీసుకువస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగోతు రమేశ్‌నాయుడును నియమించిన సందర్భంగా జరిగిన శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రమేశ్‌నాయుడు విద్యార్థి నాయకుడిగా, సర్పంచ్‌గా, బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా అంచెలంచెలుగా ఎదిగి నేడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చేరుకోవడం అభినందనీయమన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎమ్మెల్సీ జకియా ఖానం, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త రీజెన్సీ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు, కడప జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ బీజేపీ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నాయకుడు వేమన సతీష్ కార్పొరేషన్ చైర్మన్ దినకర్ తదితరులు రమేశ్‌నాయుడు సేవలను కొనియాడి ఆయనను సత్కరించారు. నాగోతు రమేశ్‌నాయుడు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో నేడు ప్రపంచంలోనే అగ్రగామిగా దేశంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. తమ ప్రాంత ప్రజలు తనకు చేసిన సన్మానాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటానని, ఇంత భారీ ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నాయకులందరూ హాజరై తనను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

జిల్లా కేంద్రం చేయాలని మంత్రికి వినతి

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి సభ్యులు మంత్రి సత్యకుమార్‌కు విజ్ఞాపనపత్రాన్ని అందజేశారు. ఎంతో చరిత్ర కలిగిన, పార్లమెంటరీ, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విజ్ఞప్తి చేశారు.



రమేశ్‌నాయుడు సన్మానసభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

వెంకటరమణ హార్ట్ & మెటర్నిటీ హాస్పిటల్
డి.నెం. 10-3-206/ఎ3/ఎ, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి, 0877-2258183, 9490109100
ప్రముఖ గుండె వైద్య నిపుణులు
డా॥ సి.వెంకటరమణ
ఎం.డి.,డి.ఎం.,(కార్డియాలజీ)
ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు
డా॥ ఆర్.నిరుపమ
ఎం.బి.బి.ఎస్., డిజిఓ
EHS, WJHS, ALL TYPES OF INSURANCES AVAILABLE APSPDCL
24 గంటలు ఎమర్జెన్సీ, ICU
Cathlab, CTOT, Advanced Surgical OT, Labour Room

మహిళల ఉసురుతోనే జగన్ ఓటమి

- మహిళలకు పెద్దపీట వేసిన చంద్రబాబు
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



స్త్రీ శక్తి విజయోత్సవ సభలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తల్లి..చెల్లిని మోసం చేసి ఇంట్లో నుంచి గెంటేసిన జగన్‌కు మహిళల ఉసురు తగిలి ఓడిపోయాడని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో శనివారం సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గ స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. అంతకుమునుపు పీటీఎం రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి బస్టాండు సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డు వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన కుప్పం మున్సిపల్, తిరుపతి పార్లమెంటు ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించేందుకు ఇక్కడి మహిళలను భయపెట్టి తీసుకెళ్లిన దుర్మార్గపు కుటుంబం పెద్దిరెడ్డిది అన్నారు. దొంగ ఓట్లతో గెలిచాడు కాబట్టే ద్వారకనాథరెడ్డి నియోజకవర్గానికి రావడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మహిళా నేత కల్పనరెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, పరిశీలకుడు సోమశేఖర్, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల అధ్యక్షులు వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, మహిళా నేతలు కల్పనరెడ్డి, పూల సుజాత, లక్ష్మీప్రసన్న, రామసుబ్బమ్మ, సిద్దమ్మ, వనజమ్మ, గంగాదేవి, నాయకులు భజంత్రి రామాంజులు, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో మహిళల భారీ ర్యాలీ

పేరుంది... ఊరే లేదు...


- ఊరుగాని ఊరు ఆకేపాడు
- సుమారు 20 గ్రామాల సముదాయమే ఆకేపాడు
- ఉప మండలంగా కొనసాగుతూ గ్రామమే లేకుండా గుర్తింపు

ఊరే లేని ఊరులో ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం





ఆకేపాడులో ఉన్నత పాఠశాల



ఆకేపాడు పేరిట ఉన్న స్టేట్‌బ్యాంకు

రాజంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో ఆకేపాడు గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంది. అసలు ఆకేపాడు అన్న గ్రామం లేకుండానే సుమారు 20 గ్రామాల సముదాయం ఆకేపాడు గ్రామంగా పిలువబడుతోంది. సుమారు 5 వేలు పైబడి జనాభా కలిగిన ఆకేపాడులో 20 మజరా గ్రామాలు ఉన్నాయి. అయితే ఏ ఒక్క గ్రామానికి ఆకేపాడు అన్న పేరే లేదు. అయితే ఈ ఆకేపాడు గ్రామం రాజంపేట మండలంలో ఓ ఉప మండలంగా కొనసాగుతోంది. ఆ గ్రామ పరిధిలోని 20 మజరా గ్రామాలతో పాటు చుట్టుపక్కల ఐదు గ్రామ పంచాయతీల్లోని 50 పైబడి పల్లెలను ఆకేపాడు ఏరియాగా పిలుస్తుంటారు. అయితే ఇంతవరకు ఏ గ్రామానికి గాని ఆకేపాడు అన్న పేరు లేదు. ఈ గ్రామానికి చెందిన ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆకేపాటి గోపాల్‌రెడ్డి ట్రస్టు చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి ఇంటిపేరుగా గ్రామానికి ఉండడం విశేషం. వారి ఊరు ఆకేపాడుగా, వారి ఇంటిపేరు ఆకేపాటిగా ఉండే తప్ప ఏ గ్రామానికి ఆకేపాడు అని లేదు. ఈ గ్రామంలో రాజంపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఉంది. మండలంలో ఏర్పాటు చేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకేపాడులోనే ఉంది. రాజంపేట పట్టణంలో వంద పడకల ఏరియా ఆసుపత్రి ఉండడంతో సుమారు 30 ఏళ్ల కిందట ఈ గ్రామంలో మండలానికి సంబంధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ గ్రామం పేరిట ఆ ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ఉన్న 50 గ్రామాల ప్రజలు ఇక్కడే వైద్యం చేయించుకుంటూ ఉంటారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్టేట్ బ్యాంకు, సచివాలయం, టీటీడీ కల్యాణ మండపం ఆకేపాడులోనే ఉన్నాయి. ఈ మార్గం గుండానే అన్నమయ్య ప్రాజెక్టుకు కూడా వెళుతుంటారు. ఆకేపాడు పరిధిలో సుమారు 20 గ్రామాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా కట్టకిందపల్లె, బుడుగువారిపల్లె, శ్రీరంగరాజపురం, అచ్చనపల్లె, కమ్మపల్లె, అయ్యపురాజుగారిపల్లె, వడ్డుకాడుపల్లె, రామిరెడ్డిగారిపల్లె, అరుంధతివాడ, లచ్చయ్యగారిపల్లె, గంగురాజుపల్లె, ఎస్సీ కాలనీ, పెద్దూరు, తిప్పరాజుపల్లె, నారంరాజుపల్లె మజరా గ్రామాలు ఉన్నాయి. అయితే ఏ గ్రామానికి కూడా ఆకేపాడు అన్న పేరే లేదు. ఇదేమని గ్రామస్థులను ప్రశ్నిస్తే ఈ ఊర్లు అన్నీ ఆకేపాడు అంటారు తప్ప దానికి నిజమైన కారణాలు చెప్పలేదు. ఏదేమైనా ఊరే లేకుండా ఆ ఊరు కొనసాగడం చుట్టుపక్కల పల్లెలన్నీ ఆకేపాడు సముదాయమని చెప్పుకోవడం విశేషం. రాజంపేట పట్టణానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ ఆకేపాడు గ్రామం ఇటు రాజకీయ పరంగా మంచి గుర్తింపు పొందింది.

నీటి ఎద్దడికి చెక్‌డ్యామ్

సృష్టికి జలమే జీవనాధారం. నీరు లేనిదే సమస్త జీవకోటి మనుగడ సాగదు. ఒకప్పుడు పుష్కలంగా వర్షాలతో చెరువులు నిండుకుండలా ఉండేవి. కానీ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సమస్తం కాలుష్యంగా మారుస్తున్నాడు. దీంతో తీవ్ర నీటిఎద్దడి ఏర్పడుతోంది. వ్యవసాయం చేయాలంటే నీరు పుష్కలంగా ఉండాలి. కానీ ఈ నీటిఎద్దడి వలన వ్యవసాయం మరింత భారంగా మారుతోంది. ఈక్రమంలో నీటిఎద్దడిని తగ్గించేందుకు చెక్‌డ్యామ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జలవనరులను నిల్వ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. కానీ ఈ చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో వర్షపునీరు చాలావరకు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో గుంజనేరులో వృథాగా పోతున్న నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు


ముళ్లపొదల్లో దర్శనమిస్తున్న చెరువు

చిట్వేలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకప్పుడు నిండుకుండలా కళకళలాడిన చెరువులు ప్రస్తుతం ముళ్లపొందలతో దర్శనమిస్తున్నాయి. మండలంలో తొమ్మిది పెద్ద చెరువులు, 27 చిన్న చెరువులు ఉన్నాయి. ఇందులో నాగవరం చెరువు కింద 433.40 ఎకరాలు, నగిరిపాడు చెరువు కింద 436.90, దేవమాచుపల్లె 138.10, గొట్టుమానుకోన చెరువు కింద 921, ఎల్లమరాజుచెరువు కింద 831, సిద్దారెడ్డిపల్లి చెరువు కింద 40.2, మైలపల్లి ఆనకట్ట చెరువు కింద 307, రాజకుంట చెరువు కింద 125, మాలేమార్పురం చెరువు కింద 29.2 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు లేకపోడంతో ఆయకట్టు భూములన్నీ ప్రస్తుతం బీడు భూములుగా మారాయి. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ప్రభుత్వం చెరువుల మీద దృష్టి సారించకపోతే రాబోయే రోజుల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాకాలు ఉన్నాయని వాపోతున్నారు. చిట్వేలికి మరో మూలాధారం గుంజనేరు, అలిగేరు. ఒకప్పుడు నీటితో కళకళలాడుతున్న ఈ రెండు ఏర్లు ఇప్పుడు చుక్క నీరు లేక మొండిరాళ్లతో ఎడారిలా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అరకొర కురుస్తున్న వర్షాలను పొదుపు చేసుకోవాలన్నా, భవిష్యత్ తరాలు నీటి ఎద్దడిని అధిగమించాలన్నా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని పేర్కొంటున్నారు. ఈ చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు వలన వర్షపునీరు నిలిచి భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వం నీటి వనరులపై శ్రద్ధ చూపి నీటి పథకాలు, ఇంకుడు గుంతలను ప్రోత్సహించాలి. జలనవరులు తక్కువ ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం ప్రోత్సహించడానికి ప్రభుత్వ సబ్సిడీలు పెంచాలని రైతులు చెబుతున్నారు. సేద్యపు నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. సమీకృత నీటి నిర్వహణ విధానాన్ని పటిష్టంగా అమలు పరచాలి. తద్వారా భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడిని లేకుండా కాపాడవచ్చు. ఇకనైనా ప్రభుత్వం నీటి భద్రతపై ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయమే ఆధారం..

డిగ్రీ పూర్తి చేసినప్పటికీ పాడి పంటలపై ఉన్న మక్కువతో నాకున్న నాలుగున్నర ఎకరాల్లో మూడెకరాల్లో గడ్డిమొక్కలు నాటాను. ఒకటిన్నర ఎకరాల్లో మామిడి పంటను పండిస్తున్నాను. నా చిన్ననాటి తనంలో వర్షాలు పుష్కలంగా కురుస్తూ గుంజనేరులో ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండేది. దీంతో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటూ వ్యవసాయానికి ఆధారంగా ఉండేది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వ్యవసాయం భారంగా మారింది. అరకొర కురుస్తున్న వర్షాలను, నీటిని పొదుపు చేయాలంటే గుంజనేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. ప్రభుత్వం పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.



- సింగనమల మల్లేశ్వరయ్య, రైతు


గుంజనేరు

గుర్రంకొండలో పట్టపగలే చోరీ

- 20 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు అపహరణ
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు


దుండగులు ధ్వంసం చేసిన బీరువా

గుర్రంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలో పట్టపగలే వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పగలు తాళం వేసిన ఇళ్లను దుండగులు రెక్కీ నిర్వహించి దోచుకుపోతున్నారు. దీంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. పట్టణంలో నెల రోజుల వ్యవధిలో నాలుగు చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధితుల వివరాల మేరకు... పట్టణంలోని బలిజగడ్డకు చెందిన శ్రీనివాసులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం వద్ద వ్యవసాయ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసుకొని వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకొని మధ్యాహ్నం 1గంటకు ఇంటికి వచ్చే సమయానికి దుండగులు తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి బట్టలను చిందర వందరగా పడేశారు. అంతేకాకుండా బీరువాలో ఉన్న నగదు, బంగారం వస్తువులను దోచుకుపోయారు. డ్రాలో ఉన్న రూ.60 వేల నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. పక్కనే ఉన్న మరో ఇంటిలో కూడా దుండగులు చోరీకి పాల్పడి ఇంటిలో వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రఘురాం సంఘటన స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. పది రోజుల క్రితం మరో రెండు ఇళ్లల్లో దుండగులు చోరీ చేసి నగదును దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టణంలో పట్టపగలే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సిద్దవటం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ద్విచక్రవాహనం చోరీకి గురికావడం చర్చణీయంగా మారింది. సిద్దవటం గ్రామంలో బందారుపల్లె ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బాలచంద్ర ఈనెల 4న ఉదయం 9గంటల సమయంలో కడపకు వెళుతూ ద్విచక్ర వాహనాన్ని పోలీసులైను క్రాస్‌రోడ్డులోని పోలీసుస్టేషన్ వెనుకభాగమైన గాలి మిషన్ వద్ద నిలిపివెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు వచ్చేసరికి అక్కడ ద్విచక్ర వాహనం కనపడకపోవడంతో పరిసర ప్రాంతాల్లో విచారించినా వాహనం ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై ఈనెల 5వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం బాలచంద్ర మాట్లాడుతూ 2015లో ప్లాటినా ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ప్రతిరోజు గ్రామంలో న్యూస్ పేపర్లు పంపిణీ చేసి అనంతరం కడపలోని ఓ ప్రైవేటు షాపులో పని చేసేందుకు వెళ్తానని, ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇక్కడ పెట్టి వెళతానన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారని వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దర్గా భూ వివాదంలో మహిళపై దాడి


గాయపడిన ముబీనాబీ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాగిమాకులపల్లె క్రాస్ వద్ద ఉన్న మున్వర్‌ఆలీషా ఖాద్రి దర్గా భూ వివాదంలో దర్గా సభ్యురాలు ముబీనాబీపై దాడి జరిగింది. ఈ దాడిలో ముబీనాబీ తలకు తీవ్ర గాయమైంది. దర్గా కమిటీ సభ్యుల వివరాల మేరకు... దర్గా కమిటీ చైర్మన్ మున్వర్‌ఆలీషా ఖాద్రీ మృతి తర్వాత దర్గా కమిటీ సభ్యులు, మున్వర్ కొడుకు గౌస్‌పీర్ మధ్య చైర్మన్ పదవి కోసం కొన్ని నెలలుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో ఈ దర్గాలో ఉరుసు జరుగనుంది. దీని నిర్వహణ కోసం ఇరువర్గాల మధ్య శనివారం మరోమారు వివాదం చోటుచేసుకోగా ఓ వర్గంవారు ముబీనాబీపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మఠం భూముల పరిరక్షణకు చర్యలు

కలికిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికుర్తి క్రాస్ సమీపంలో ఉన్న శివయోగి మఠం భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం తెలిపారు. రాష్ట్ర జంగం సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్‌తో కలిసి శనివారం ఆయన ఈ మఠం భూములను పరిశీలించారు. విలువైన మఠం భూములకు హద్దులు నిర్ధారించాలని రెవెన్యూ అధికారులను కోరనున్నట్లు విశ్వనాథం తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి ధూపదీప నైవేద్యం నిధుల మంజూరు కోసం వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించిన ఆలయాలను ఆయన పరిశీలించారు. మండలంలోని కొటాల గ్రామంలోని సల్లాపురమ్మ ఆలయం, విశ్వేశ్వరాలయం, నల్లగంగమ్మ దేవాలయం, లక్ష్మీనగర్‌లోని మహాలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మేడికుర్తి క్రాస్‌లోని శివాలయం, రంగనాథపురం రామాలయాలను ఆయన పరిశీలించారు.

వాలీశ్వరస్వామి ఆలయ భూముల సర్వే


ఆలయ భూములు సర్వే చేస్తున్న ఈవో రమణ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని వాలీశ్వరస్వామి ఆలయ భూములను ఎండోమెంట్ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ ఆలయానికి మొత్తం 124ఎకరాల భూమి ఉంది. ఇందులో 49ఎకరాల భూమిని గత శివరాత్రి సందర్భంగా రైతులకు లీజుకు ఇచ్చారు. మిగిలిన భూమి అన్యాక్రాంతం కాగా వాటి లెక్క తేల్చడానికి శనివారం సర్వే చేపట్టారు. దేవదాయ శాఖ ఈవో రమణ మాట్లాడుతూ ఆలయ భూమిని కొందరు గ్రామస్థులు ఎండోమెంట్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే దురాక్రమణ చేసి సాగు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి భూమి స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని దేవదాయ శాఖకు చెందిన ఇతర ఆలయాల భూమిని కూడా సర్వే చేయించి ఆ భూములను స్వాధీనం చేసుకుని వాటిని లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సర్వేలో ఎండోమెంట్ సర్వేయర్ రమేష్, మండల సర్వేయర్ నరేంద్ర, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాలతి



వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వై.మాలతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పదోన్నతి పొంది అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ మాలతిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మాలతి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక వైద్యులు, సిబ్బందితో సమావేశమై విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని రోగుల పట్ల మర్యాదతో మెలగాలన్నారు.

10లోగా సర్వేను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో స్వామిత్వ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వే గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకమన్నారు. స్వామిత్వ సర్వేతో గ్రామాల్లో ఆర్థిక, సామాజిక, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రధాని మోదీ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పంచాయతుల్లో సర్వే పూర్తి కాగా మిగిలిన పంచాయతీ సిబ్బంది త్వరతగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపల కార్యదర్శులు రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠం, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠం తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా విధానాలపై సీపీఐ నిరసన

బి.కొత్తకోట/ములకలచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రయోజనాలను, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా దేశ దిగుమతులపై 50శాతం సుంకాన్ని విధిస్తూ అగ్రరాజ్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ సీపీఐ నేతలు శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎర్రజెండాలతో నిరసన తెలిపారు. అమెరికా పెత్తందారి విధానాలపై మోదీ ప్రభుత్వం మౌనం వీడాలని ములకలచెరువు బస్టాండు వద్ద సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఊడిగం చేస్తున్న మోదీ దేశ ప్రయోజనాలను దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, బాబు, హబీబ్, షఫీ, గంగులప్ప, సోము మల్లికార్జున, రెడ్డెప్ప, సుబ్బన్న, రవణప్ప, ఉత్తన్న, రామచంద్ర, సరోజమ్మ, నరసమ్మ, శంకరమ్మ, శ్యామలమ్మ, లక్ష్మీదేవి, పాపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గాలికుంటు, బొబ్బల వ్యాధి రాకుండా ముందుగానే పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యుడు డాక్టర్ రామచంద్రుడు సూచించారు. ఆత్మా చిన్నగొట్టిగల్లు బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం తలపులలో పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలంటే పశుపోషణలో ముఖ్యమైన సైలేజ్ తయారీ విధానంపై రైతులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. తయారు చేసిన మేతను వాడుకోవడం ద్వారా పాల దిగుబడి 2 నుంచి 3 లీటర్లు పెంచుకోవచ్చన్నారు. పొదుగువాపు వ్యాధి రాకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తద్వారా అధిక నష్టాన్ని అరికట్టవచ్చన్నారు. పుట్టిన దూడలకు 10రోజుల తరువాత నుంచి 6నెలల వ్యవధిలో పలు దఫాలుగా టీకాలు ఇవ్వడం వల్ల దూడలు ఆరోగ్యకరమైన ఆవులుగా ఎదుగుతాయని తెలిపారు. అనంతరం ఆత్మా అందించే కిలో మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. బాహ్య పరాన్న జీవులను అరికట్టే చర్యల్లో భాగంగా ఆవులకు పిడుదుల మందును స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఆత్మా బీటీఎం జ్యోత్స్న, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్న దృశ్యం

మదనపల్లెను ఎప్పటికీ మరువలేను

- ఆ మూడు ప్రాంతాలూ మూడుకళ్లు
- నా జీవితాన్ని తీర్చిదిద్దింది వారిద్దరే
- మదనపల్లె జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న మంత్రి సత్యకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మదనపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'నాకు జీవితంలో అనుభవాలు, జీవిత పాఠాలు, సమాజం పట్ల బాధ్యతలు నేర్పిన మదనపల్లెను ఎప్పటికీ మరువలేను. నాకు మదనపల్లె ఎంత ముఖ్యమో రాజకీయ జన్మనిచ్చిన ధర్మవరం కూడా అంతే ముఖ్యం. మొదట నాకు అనుభవ పాఠాలు నేర్పిన మదనపల్లె నాకు ఒక కన్ను అయితే, జన్మనిచ్చిన పొద్దుటూరు రెండో కన్ను అని, ఇక ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిగా ఆశీర్వదించిన ధర్మవరం మూడో కన్ను' అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. జననం, బాల్యం, విద్యాభ్యాస్యం, చివరకు రాజకీయ భిక్ష ప్రసాధించిన ఆ మూడు ప్రాంతాల జ్ఞాపకాలు, అనుభవాలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యార్థి దశలో పోరాటాలు నేర్పిన మదనపల్లె, ఇక్కడి స్నేహితులను పేరుపేరునా గుర్తు చేశారు. ఈ మూడు ప్రాంతాలను ఎప్పటికీ మరువలేనని చెప్పిన మంత్రి ప్రత్యేకంగా మదనపల్లెను ప్రస్తావిస్తూ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తూ ఇక్కడి రుణం తీర్చుకుంటానని ప్రకటించారు. మదనపల్లె సహా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రతిపల్లె, ప్రతి కుటుంబం తనకు తెలుసునని, ఇప్పటికీ వంద కుటుంబాల పేర్లు చెప్పగలనన్నారు. మరోవైపు మదనపల్లె పాలిటెక్నిక్ కళాశాల వేదికగా విద్యార్థి పరిషత్తు కార్యకర్తగా నక్సలిజంపై చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. మొదట్లో తాను పాలిటెక్నిక్ సత్యగా, తర్వాత పొద్దుటూరు సత్యకుమార్‌గా, ధర్మవరంతో సత్యకుమార్ యాదవ్‌గా గుర్తింపు పొందడాన్ని నమ్మలేకపోతున్నట్లు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. తనకు తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థి దశలో బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, దేశ రాజకీయాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పరిచయం చేశారని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా మదనపల్లె పేరును ప్రస్తావిస్తే, తాను ఉద్వేగానికి లోనవుతానని, అలాంటి స్థానం కల్పించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చల్లపల్లె నరసింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ఎన్.రమేష్‌నాయుడు, దినకర్, ఎన్.సేతు, గుత్తి హరికృష్ణ, జబ్బల శ్రీనివాసులు, టీడీపీ నేతలు రాటకొండ బాబురెడ్డి, కొపూరి మల్లికార్జుననాయుడు, నాదెళ్ల విద్యాసాగర్, గొల్లెన్‌వ్యాలీ రమణారెడ్డి, ఎంఆర్‌పీఎస్ నరేంద్ర, జంగాల శివరామ్, శ్రీరామ రామాంజనేయులు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రిని నిర్మించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా నిర్మించాలని, అందుకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. శనివారం రాజంపేట నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సుండుపల్లె మండలం 15 గ్రామ పంచాయతీలతో సుమారు లక్షకు పైగా జనాభా కలిగి ఉందని, కానీ సరైన వైద్యం లేక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అందుకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో లేకపోవడమేనని వివరించారు. 24 గంటలు సేవలు అందించే 30పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీజేవైయం జిల్లా నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు
- అధికారులు, ట్రేడర్స్, రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధరల నిర్ణయం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి నేతాజి సర్కిల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరాని కంటే మించి యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ట్రేడర్స్ రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధర నిర్ణయించబడుతుందని, బొప్పాయి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 44శాతం లోటు వర్షపాతం నమోదు అయిందని, దీని వల్ల 57 వేల హెక్టార్లకు గాను కేవలం 10600 హెక్టార్లల్లో సాగు చేస్తున్నారన్నారు. దీంతో 18శాతం మాత్రమే సాగువుతోందని సెప్టెంబర్ 6 నాటికి ప్రవేటు డీలర్ల వద్ద 518 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రంలో 460 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. 10600 హెక్టార్లు అనగా సుమారు 25 వేల ఎకరాలకు గాను ప్రస్తుతం అందుబాటులో ఉన్న 978 మెట్రిక్ టన్నుల యూరియా సరిపోతుందన్నారు. వచ్చే వారంలో 4000మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంఎస్ స్వామినాధన్ లాంటి వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించినట్లుగా రసాయనిక ఎరువులను అవసరానికి మించి వినియోగించడం వల్ల భూమి సారవంతం తగ్గుతుందన్నారు. జిల్లాలో 4000 మంది రైతులు 11వేల ఎకరాలల్లో బొప్పాయి పంట పండిస్తున్నారని, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో బొప్పాయి సాగు అధికంగా ఉందన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, చైర్మన్ రూపానందరెడ్డి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి 9 రూపాయలతో బొప్పాయి ధర నిర్ణం చారన్నారు. ఢిల్లీలో ఏ ధరైతే ఉంటుందో దానికి అనుగుణంగా ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రైతులను రెచ్చకొట్టడం నేరమన్నారు. సోషియల్ మీడియాలో తప్పుడు కథనాలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం పీలేరు కోర్టు ఆవరణలో పీలేరు, కలకడ, భాకరాపేట, సదుం, రొంపిచెర్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో సివిల్, క్రిమినల్, మోటారు వాహన కేసులు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్, బీఎస్‌ఎన్‌ఎల్ తదితర కేసులు పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు సహకరించాలని పిలుపునిచ్చారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమష్టి కృషితో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని, ఇందులో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని జడ్జి సూచించారు. సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, కలకడ సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐలు లోకేశ్, సుబ్బారెడ్డి, బాలక్రిష్ణయ్య, షేక్‌షావల్లీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఓఈలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (మూడేళ్ల, ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం సాయంత్రం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ (ఐదేళ్ల) మొదటిసెమిస్టర్ పరీక్షల్లో 50 శాతం మంది, ఎల్ఎల్‌బీ (మూడేళ్ల) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 17శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కెఎస్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

బ్యూటీషన్, టైలరింగ్‌పై.. మహిళలకు ఉచిత శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 31 రోజుల పాటు టైలరింగ్, 35 రోజుల పాటు బ్యూటీపార్లర్ రంగంలో మహిళలకు ఉచితంగా ఇస్తున్నట్లు డైరెక్టర్ వి. అప్పర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు పైశిక్షణ కార్య క్రమాలకు అర్హులని, గ్రామీణప్రాంత మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు 9440905478, 9985606866, 94409 33028 నెంబర్లకు ఫోను చేసి తెలుసుకోవచ్చున్నారు. దూర ప్రాంతాలవారికి ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు.

వెల్లాల ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న బండి ఆంజనేయులు

రాజుపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం కడప జిల్లా సాయిపేటకు చెందిన బండి దేవకి, ఆంజనేయులు దంపతులు రూ.2లక్షలు విరాళం అందజేశారు. పాలకమండలి సభ్యులకు ఈచెక్కు అందించారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టుకు తగ్గిన కృష్ణాజలాల ప్రవాహం

కొండాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా గండికోట ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో శనివారం నుంచి తగ్గినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇది వరకు సుమారు 11,000 క్యూసెక్కుల వరకు కృష్ణాజలాలు వస్తుండగా, ప్రస్తుతం 6,000 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి వెళ్లే నీటిని 10,000 క్యూసెక్కుల నుంచి 5,000 క్యూసెక్కులకు తగ్గించినట్లు ఈఈ తెలిపారు. దీంతోపాటు సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు, కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 23.741 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

బాకీ పేరుతో బెదిరింపులు

- ఆగ్రహించిన వ్యాపారులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

యాడికి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారు.. డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయలచెరువులో చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా శనివారం సాయంత్రం పలు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు బాకీ వున్నారు, ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. పలు పెయింట్ షాపుల వద్దకు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆగ్రహించిన షాపు యజమానులు అతడికి దేహశుద్ధి చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించాడని వ్యాపారులు ఆరోపించారు. విషయం పోలీసులకు సమాచారం తెలపగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవి ?

- సంవత్సరాలు గడిచినా చర్యలు శూన్యం
- అనర్హత గల అధికారి పాత్రపై అనుమానం
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని అధికార యంత్రాంగం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో నిధులు పక్కదారి పడుతున్నాయి. సంవత్సరాలు గడిచినా అక్రమార్కులపై చర్యలు లేవు. జిల్లాలో పలుచోట్ల డ్వాక్రా సంఘాల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో కొన్ని చోట్ల అప్పటికప్పుడు ఆరోపణలు వచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగింది. అయితే భారీ స్థాయిలో నిధుల గోల్‌మాల్ జరిగి సంవత్సరాల కాలం దాటిపోతున్నా కేవలం ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం ఆ తరువాత ఆ విషయాన్ని మరుగున పడేశారు.

వల్లూరు మండలంలోని వెలుగు పథకంలో దాదాపు రూ.80లక్షల మేర అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టడమే కాకుండా కలెక్టరు సూచనల మేరకు థర్డ్ పార్టీ ఎంక్వయిరీ కూడా నిర్వహించారు. అయితే ఈ విచారణలో ఒక కమ్యూనిటీ కోఆర్డినేటరు తన సొంత ఖాతాకు నిధులు మళ్లించుకుని దుర్వినియోగానికి పాల్పడినట్లు వెల్లడైంది. అయితే అదే విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని నిధుల అక్రమాల్లో అప్పటి ఏరియా కోఆర్డినేటరు బి.సత్యనారాయణ పాత్ర ఉందని.. ఆయన చెబితేనే తాను నిధులు డ్రా చేసి తీసుకెళ్లి ఇచ్చానని ఆమె విచారణ అధికారికి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంటు ఇచ్చినట్లు సమాచారం.



డీఆర్‌డీఏ ఆఫీసు

అయితే ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏరియా కోఆర్డినేటరు అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేస్తుండడం వల్ల చర్యలు తీసుకోనట్లుగా స్పష్టమవుతుంది. అంతేకాకుండా గతంలో ఉన్న పీడీ కేవలం నోటీసులు ఇచ్చి సరిపుచ్చారనేది సమాచారం. అయితే రూ.80లక్షలకు పైగా నిధులు పక్కదారి పడితే కేవలం రూ.20లక్షలు మాత్రమే కమ్యూనిటీ కోఆర్డినేటరు పాత్ర ఉందని రికవరీ పెట్టారు.

మిగిలిన నిధులు ఏమైనట్లు?

వల్లూరు మండలంలో పక్కదారి పడుతున్న నిధుల్లో రూ.20లక్షలు కమ్యూనిటీ కోఆర్డినేటరు నుంచి వసూలు చేసేట్లు డీఆర్‌డీఏ అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కొంత మేర ఆమె నుంచి దశల వారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది., అయితే మిగిలిన మొత్తం ఎటు పోయినట్లు, ఏమైనట్లో అర్థం కాని పరిస్థితి. ఇంత కాలం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వల్లూరు మండల సమాఖ్య ప్రతినిధులు కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ కేసులో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తాయని చర్చ జరిగింది. కానీ యదావిధిగా నిధుల దుర్వినియోగంపై మౌనమే రాజ్యమేలుతుంది. ఒక వల్లూరు మండలంలోనే కాకుండా అట్లూరు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వెలుగు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి నిధుల స్వాహాకు తెరలేపినట్లు ఆరోపణలు లేకపోలేదు. అయితే అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న సత్యనారాయణపై సెర్ప్ చర్యలకు ఉపక్రమించింది. అక్కడ కూడా ఇసుక క్వారీలో అక్రమాలు చోటు చేసుకోవడంపైనే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో వల్లూరు మండలంలో ఆగిపోయిన విచారణ ఇక నుంచైనా ముందుకు సాగుతుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నమోదు కాని కేసు

వల్లూరు మండలంలో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని మండల సమాఖ్య సభ్యులు గతంలో వల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ అప్పట్లో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు జోక్యం చేసుకోవడంతో కేసు నమోదు చేయకుండా ఫిర్యాదు పక్కనపెట్టారు. తరువాత కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కేసు నమోదు కాని పరిస్థితి. జిల్లా కలెక్టరు చొరవ తీసుకుని ప్రభుత్వాలు మహిళాభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టే అంశంపై దృష్టిసారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ నిధుల దుర్వినియోగం, కేసు ఫిర్యాదులపై విచారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై కడప డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్షణికావేశంలో జీవితాలను పాడు చేసుకోవద్దు

- 5కే రెడ్ రన్‌లో యువతకు డీఎంహెచ్‌వో పిలుపు

కడప కలెక్టరేట్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసే తప్పిదాలతో మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు యువతకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఎయిడ్స్ నియత్రణ, జిల్లా శాఖల ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్ 2025-26లో భాగంగా 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ 5కే రెడ్ రన్ మారథాన్ మహవీర్ సర్కిల్ నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు, అక్కడ నుంచి తిరిగి మహవీర్ సర్కిల్ వరకు సాగింది. కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతీ యువకులు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష తగదని అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు పేర్కొన్నారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌కు చికిత్స ఉందని, దీనిపై సందేహాలుంటే సమీపంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేసుకోవాలన్నారు. 5కే రెడ్ రన్ పోటీల్లో మొదటి బహుమతి సింహాచలం, రెండో బహుమతి సికిందర్‌లు గెలుపొందారు. అమ్మాయిల విభాగంలో శ్రీశకు ప్రథమ బహుమతి, రెండో బహుమతి కీర్తి, ట్రాన్స్‌జండర్ విభాగంలో మొదటి బహుమతి పింకి, రెండో బహుమతి మహేష్‌లు గెలుపొందారు. ఈసందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ విజేతలను అభినందించారు. జిల్లా క్రీడలశాఖాధికారి జగన్నాథరెడ్డి యువత ఆరోగ్యం, నైపుణ్యాలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గురవయ్య, సుబ్బరాయుడు, రమేష్ వెంకటరెడ్డి, అమృత్, కళ్యాణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



5కే రెడ్‌రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫాతిమా కాలేజీ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 30 నుండి 35 సంవత్సరాలు వయసు ఉంటుందని, బ్లూకలర్ టీషర్టు ధరించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తుపట్టి.. ఏదైనా సమాచారం ఉంటే 9440627658, 94409 00811కు ఫోను చేసికడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డికి తెలపాలన్నారు.

వ్యక్తిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

పులివెందుల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలమవారిపల్లెకు చెందిన రుత్విక్‌నాయుడు అనే వ్యక్తిపై నగరిగుట్టకు చెందిన రాజేష్‌తో పాటు మరికొంతమంది దాడి చేశారు. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి అనే అతనితో తిరుగుతున్నాననే కారణంగా తనపై దాడి చేశారని రుత్విక్ నాయుడు ఆరోపించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బాలికపై అత్యాచారం... యువకుడి అరెస్టు

- పోక్సో కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉలసయ్య

వేముల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వారి వివరాల మేరకు... వేములకు చెందిన కుంచెపు వెంకట రమణ అనే యువకుడు ఇంటర్ మధ్యలో ఆపేసి బేల్దారి పనిచేసుకుంటున్నాడు. నాలుగు నెలల నుంచి ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. గత నెల 30వ తేదీ బాలికను బలవంతంగా తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

కేవీకేకు నాలుగు అవార్డులు

సీకేదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు అవార్డులు లభించినట్లు కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని వేలూరులో సెప్టెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన జోనల్‌స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు పురస్కారాలు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అందులో షెడ్యూలు కులాల ఉపప్రణాళిక పథకాన్ని విజయవంతంగా జిల్లాలో అమలుపరిచినందుకు ప్రథమస్థానం, జిల్లాలో అత్యుత్తమ ఫొటో విభాగంలో ప్రథమస్థానం, జిల్లాలో మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను విస్తరించినందుకు ప్రథమస్థానం, అపరాల ఆదర్శ గ్రామం పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు మూడవస్థానం దక్కినట్లు తెలిపారు. ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక అనే ప్రయోగ సంస్థ, జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ సమక్షంలో అందజేశారన్నారు. ఈ పురస్కారాలు రావడానికి కృషి చేసిన ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, విస్తరణ సంచాలకులు శివనారాయణ, పరిశోధన సంచాలకులు తులసిలకు అభినందనలు తెలిపారు. అదే విధంగా కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ అవార్డులు దక్కాయన్నారు.

గండిక్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు

రూ.4లక్షల ఆదాయం

చక్రాయపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండిక్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు శనివారం భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వివిధ ఆర్జితసేవల ద్వారా రూ.4,03,348 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, 1500 మంది అన్నప్రసాదంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 4గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తారన్నారు. తిరిగి సోమవారం 7గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.


పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలను అధిగమించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

కడప రూరల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణ చట్టాల అమలులో ఆయా శాఖల అధికారులు సమస్యలను అధిగమించి తద్వారా లక్ష్యసాధనకు పాటుపడాలని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాదన్‌లో పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిపార్ట్‌మెంట్‌ల వారీగా సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. బాల్య వివాహాలు, గర్భదారణ, పిల్లల ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు. జేజేబీ చట్టం 2015, పోక్సో చట్టం 2012, పీసీఎంఏ 2006, బాల కార్మిక చట్టం 1986 తదితర చట్టాల గురించి తెలియపరిచారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగస్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456 తెలియపరిచారు. సమావేశంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కె.భార్గవి, కడప జిల్లా డీఆర్‌వో, కడప, అన్నమయ్య జిల్లాల ఏఎస్‌పీలు, డీఎంహెచ్‌వో, సోషల్‌వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, సర్వశిక్ష అభియాన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- కలెక్టరుకు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. శనివారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల నుంచి పంచా యతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీని సకాలంలో అందజేయాలన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కుడా)నిధులు విడుదల చేయా లన్నారు. నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నా యన్నారు. గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని.. కనీసం పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నా నిధులు లేవన్నారు. సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు సహకరించాలని కోరారు.



10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్ : 90105 01122. Ajc-245331

WANTED

APSRTC మైదుకూరు డిపో బస్టాండ్‌నందు మైక్ అనౌన్సర్లుగా యువతి యువకులు కావలెను. కడప ఆర్టీసి ఇంద్రబస్సులోకి టి.వి. అటెండర్స్ కావలెను. సంప్ర : 8985852244 Ajc-233195

Wanted Computer Operator

భారత్ ఆన్‌లైన్ సర్వీస్, కడప నందు పనిచేయుటకు అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. (తెలుగు, ఇంగ్లీష్ టైపింగ్) కలిగి మీసేవ సెంటర్ నందు పనిచేసిన వారికి ప్రాధాన్యత. సెల్ : 6281510785 Ajc-245335

అర్జంటుగా కావలెను

కడపలో తెలంగాణ కార్గో ఆఫీసు నందు అనుభవంగల కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. కడపలో ఏంజెల్స్ లేడీస్ హాస్టల్ నందు వంట మనుషులు కావలెను. సంప్ర : 8985852244 Ajc-233194

యూనిట్ కార్యాలయం

9985411183
9985411189

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647. AJA- 246588

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ప్రణాళికాబద్ధంగా రహదారుల అభివృద్ధి

- రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి

కడప రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారని... అందుకు అనుగుణంగా అధికారులు పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ మేరకు నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల కురిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు, వాటి అంచనా విలువపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలను పంపాలని ఆదేశించిందన్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి కడప జిల్లాలోని వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే పనులు చేపట్టేందుకు ప్రణాళికలను తయారు చేసి పంపాలన్నారు. నిధులు మంజూరు కాగానే ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎస్ఈ వై.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వర్షాలకంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు, లేయర్లకు సంబంధించి వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి రూ.235 కోట్లు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట డివిజన్‌కు సంబంధించి రూ.37 కోట్ల మేర ప్రతిపాదనలను పంపామని తెలిపారు.

రహదారుల పరిశీలన

జిల్లాలోని పలు రహదారులను రహదారులు భవనాల శాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతకొమ్మదిన్నె మండలంలోని ఎన్టీపీసీ నుంచి కడప నగరం 18వ డివిజన్‌లోని విశ్వనాథపురం రైల్వే గేటు వరకు ఉన్న ఆర్అండ్ బీ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ టక్కోలి కృష్ణారెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయకులు ఎం. మునీంద్రయాదవ్, స్థానిక నాయకులు కలిసి ఈ రహదారి పనులకు రూ.12 కోట్లతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని త్వరలో నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ వై.నాగేశ్వరరెడ్డి, డీఈ కళ్యాణి, శేషావలి, తదితరులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె మండలం ఎన్టీపీసీ నుంచి విశ్వనాథపురం వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వివరాలను ఈఎన్‌సీ వివేకానందరెడ్డికి తెలియజేస్తున్న టీడీపీ నేతలు

'నైపుణ్య శిక్షణతో యువతలో ఆత్మవిశ్వాసం'

రాజంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాలతో ఉద్యోగావకాశాలు పెరగడంతోపాటు యువతలో ఆత్మవిశ్వాసం నెలకొంటుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని, నైపుణ్య చేతివృత్తుల వారి కోసం విశ్వకర్మ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కేంద్రాలతో గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయన్నారు. వీటివల్ల యువకుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్థసారథి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ముక్కావారిపల్లెలోని అంజనేయస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ స్వాగతం పలికారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి ఆంజనేయస్వామికి పూజలు చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజు, మండల అధ్యక్షుడు ముక్కా రూపేశ్‌రెడ్డి, జిల్లా నాయకులు పులపత్తూరు రామసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, పాములపాటి ప్రసాద్‌నాయుడు, పయ్యావుల కోటేశ్వరరావు, తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మీదుగా రాజంపేటకు వెళుతున్న మంత్రికి స్థానిక బీజేపీ నాయకులు, రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, రైల్వేకోడూరు బీజేపీ అధ్యక్షుడు గడ్డం చంగ్రలాజు, మాజీ హార్టీకల్చర్ విభాగం కన్వీనర్ తోట శ్రీనువాసులు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడుజయప్రకాష్ నారాయణవర్మ, మండల టీడీపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్, మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా బాలాజీ, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పార్థసారథి


మంత్రిని సత్కరిస్తున్న బిట్స్ కళాశాల చైర్మన్ ఖాస్కర్

ఆడపిల్లలను చదివించండి

రైల్వేకోడూరు,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):బాల, బాలి కల మధ్య లింగ వివక్ష చూపకుండా ఉండడంతో పాటు, బాలికలను చది వించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రామ లక్ష్మి సూచించారు. స్థానిక హెచ్‌ఎంఎం హైస్కూలులో శనివారం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేస్తే నేర మని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానం గా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి సురేష్, హెచ్‌ఎంఎం హైస్కూలు ప్రనోపాధ్యాయులు ప్రసాద్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై అవగాహన

రైల్వేకోడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు బిందు సేద్యంపై అవగాహన పెంపొందించి, వ్యవసాయంలో మరిన్ని ప్రయోజనాలు పొందేలా కృషి చేస్తున్నట్లు ఉద్యాన అధికారి భాస్కర్ తెలిపారు. శనివారం మండలంలోని శెట్టిగుంట, మారావారి పల్లె, లక్ష్మీగారిపల్లెల్లో ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందుసేద్య పరికరాలపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఇంటి వద్దకే వెళ్లి బిందు సేద్యం పరికరాల కోసం రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐడీసీ చంద్రశేఖర్, ఎంఐఏవో నజీర్, కొఠారి కంపెనీ డీసీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయానికి ఉత్సవమూర్తుల అందజేత

చిట్వేలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాత చిట్వేలిలోని వీరభద్ర స్వామి ఆలయానికి బెంగుళూరుకు చెందిన రామచంద్రరాజు, పుష్పలత కుటుంబ సభ్యులు శనివారం రూ. 10 లక్షల విలువైన ఉత్సవ విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ విగ్రహాలను సుందరంగా అలంకరించి స్థానిక శివాలయం నుంచి పాత చిట్వేలి ఆలయం వరకు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి శోభాయాత్ర

సిద్దవటం, సెప్టెంబరు 6 (ఆం ధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా దిగువపేటగాంధీ వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం నిమజ్జనానికి తరలించారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్‌రఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు బాబయ్య, సుబ్బరామచంద్ర, స్థానిక పోలీసులు, రామ్ కుమార్, జయదేవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.





డొనాల్డ్ ట్రంప్ వైఖరిపై వామపక్షాల నిరసన


రాయచోటిలో అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నేతలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ ఉత్పత్తులపై సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తూ ఇచ్చిన పిలుపులో భాగంగా శనివారం రాయచోటి పట్టణంలోని అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద వామ పక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సంద ర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీ. మహేశ్, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్, సీపీఎం జిల్లా నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం పన్నుతో దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. దీంతో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, ఆభరణాలు, వజ్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి ఉత్ప త్తుల ధరలు ఘోరంగా పడిపోయాయన్నారు. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి తీసుకోవాలని, రష్యా నుంచి ఆయిల్ కొను గోలు ఆపాలని అమెరికా షరతులు పెడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. వీసా నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు వంటి చర్యలతో ఉన్నత విద్య అభ్యసించాలనే విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయని, ఇప్పటికే అమెరికా వెళ్లిన వారు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఓబులేసు, ఆంజనే యులు, రైతు సంఘం నాయకులు హరినాథ నాయుడు, అంజద్‌అలీఖాన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: స్థానిక జాతీయ రహదారిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం వామపక్ష నాయకులు నిర సన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి, పట్టణ సీపీఎం కార్యదర్శి సికిందర్ మాట్లాడుతూ భారతదేశ సరుకులపై దిగుమతి సుంకాలను 50 శాతం పెంచుతూ ట్రంప్ ప్రకటన చేయడం దారుణమన్నారు. సీపీ ఎం, సీపీఐ నాయకులు డీవీ రమణ య్య, ప్రసాద్, కుమార్, రమణ, నాగేశ్వర్, రవి, నాగేంద్ర, రమేష్, సుబ్రమణ్యం, సురేష్, శివా, పెంచలయ్య, రాజశేఖర్, ఆదినారాయణ, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: సీపీఐ ఏరియా అధ్యక్షుడు జ్యోతి చిన్నయ్య, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సుంకాల పెంపు నేపథ్యంలో ఆక్వా ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోవడంతో ఆక్వారంగం తీవ్ర సంక్షో భంలో చిక్కుకుందన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో అనకాపల్లె, సత్యసాయి, గుంటూరు, పల్నాడు వంటి జిల్లాల్లోని ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి గండి పడిందన్నారు. ట్రంప్ సర్కారు భారత ప్రయోజనాల్ని దెబ్బ తీస్తున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మిన్నకుండిపోయింద న్నారు. ట్రంప్‌తో సహా అమెరికా పెత్తందార్లు మన దేశాన్ని అవమానించేలా ప్రకటనలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి దార్ల రాజశేఖర్, మండల సహాయ కార్యదర్శి గంగాపూరి తేజ్‌కుమార్, సీపీ ఎం నాయకులు యానాదయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరిని జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఆర్థిక, విద్యారంగ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం పట్టణంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద రణభేరికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, ఫణీంద్రకుమార్ యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు,లక్ష్మీకుమార్, నాగేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వర్ల రమేశ్‌నుశనివారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ రమేశ్ అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న షేక్ మహమ్మద్ షఫిఉల్లాను పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత ఆధ్వర్యంలో శనివారం స త్కరించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ షేక్ మహమ్మద్‌షఫిఉల్లా తమ పాఠశాలలో ఉపా ధ్యాయునిగా పని చేస్తుండడం ఇక్కడి విద్యార్థులు చేసుకున్న అదృష్టమని కొనియాడారు. భవిష్యత్‌లో రాష్ట్రస్థాయిలో మరిన్ని ఉన్నతమైన అవార్డులను ఆయన పొందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: ప్రిన్సిపాల్ వర్ల రమేశ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


షేక్ మహమ్మద్‌షఫిఉల్లాను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

పనిభారం తగ్గించాలని సచివాలయ సిబ్బంది వినతి

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): పని భారం తగ్గించాలంటూ రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ సెక్రటరీలు శనివారం రాయచోటి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఒక క్లస్టర్‌లో గతంలో ఐదారుగురు వలంటీర్లు చేసే పనిని ఒక సెక్రటరీకి కేటాయించడంతోపాటు రకరకాల యాప్‌లతో అధిక భారం మోపుతున్నారని, వినతిపత్రంలో పేర్కొన్నారు. ఒక్కొక్క సచివాలయం పరిధిలో ఒకరు, ఇద్దరు సెక్రటరీలను కేటాయించి మొత్తం హౌస్‌హోల్డ్ మ్యాప్ హోల్డ్ చేయాలని ఒత్తిడి పెట్టడం సరైన విధానం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో ఒక్కొక్క సచివాలయంలో 8 నుంచి 10 మంది ఉద్యోగులు ఉండేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిబ్బందిని కుదించి కేవలం ఆరుగురికి పరిమితం చేశారని విన్నవించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి అన్ని రకాల శాఖలకు సంబంధించిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్

రాజంపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసులు, అధికారుల, బ్యాంకు అధికారులు, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తుండడంతో, కక్షిదారులను పిలిపించి రాజీ చేసుకునే విధంగా కృషి చేయాలని కోరారు. కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్ మంచి వేదిక అని ప్రజ లందరూ ఈ జాతీయ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంత నాయుడు, ఏపీపీ మైరు, పోలీసుశాఖ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై అవగాహన

రాయచోటిటౌన్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భద్రత, చట్టాలపై జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు పాఠశాలల్లో శక్తి టీం సభ్యులు విద్యార్థులతో భద్రతా చర్చలు, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రేమ పేరుతో జరిగే మోసాలు, అప్రమత్తత , పోక్సో చట్టం, శక్తియాప్ వినియోగించే విధానం వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు ఎస్‌ఓఎస్ బటన్ ద్వారా గానీ, డయల్ 112 ద్వారా కానీ సమాచారం అందిస్తే 10 నిమిషాల్లో పోలీసుల సాయం పొందవచ్చునని అవగాహన కల్పించారు.



నీటి ఎద్దడికి చెక్‌డ్యామ్

సృష్టికి జలమే జీవనాధారం. నీరు లేనిదే సమస్త జీవకోటి మనుగడ సాగదు. ఒకప్పుడు పుష్కలంగా వర్షాలతో చెరువులు నిండుకుండలా ఉండేవి. కానీ ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సమస్తం కాలుష్యంగా మారుస్తున్నాడు. దీంతో తీవ్ర నీటిఎద్దడి ఏర్పడుతోంది. వ్యవసాయం చేయాలంటే నీరు పుష్కలంగా ఉండాలి. కానీ ఈ నీటిఎద్దడి వలన వ్యవసాయం మరింత భారంగా మారుతోంది. ఈక్రమంలో నీటిఎద్దడిని తగ్గించేందుకు చెక్‌డ్యామ్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. జలవనరులను నిల్వ చేసేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. కానీ ఈ చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో వర్షపునీరు చాలావరకు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో
- గుంజనేరులో వృథాగా పోతున్న నీరు
- ఆందోళన చెందుతున్న రైతులు


ముళ్లపొదల్లో దర్శనమిస్తున్న చెరువు

చిట్వేలి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకప్పుడు నిండుకుండలా కళకళలాడిన చెరువులు ప్రస్తుతం ముళ్లపొదలతో దర్శనమిస్తున్నాయి. మండలంలో తొమ్మిది పెద్ద చెరువులు, 27 చిన్న చెరువులు ఉన్నాయి. ఇందులో నాగవరం చెరువు కింద 433.40 ఎకరాలు, నగిరిపాడు చెరువు కింద 436.90, దేవమాచుపల్లె 138.10, గొట్టుమానుకోన చెరువు కింద 921, ఎల్లమరాజుచెరువు కింద 831, సిద్దారెడ్డిపల్లి చెరువు కింద 40.2, మైలపల్లి ఆనకట్ట చెరువు కింద 307, రాజకుంట చెరువు కింద 125, మాలేమార్పురం చెరువు కింద 29.2 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాలు లేకపోడంతో ఆయకట్టు భూములన్నీ ప్రస్తుతం బీడు భూములుగా మారాయి. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ప్రభుత్వం చెరువుల మీద దృష్టి సారించకపోతే రాబోయే రోజుల్లో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాకాలు ఉన్నాయని వాపోతున్నారు. చిట్వేలికి మరో మూలాధారం గుంజనేరు, అలిగేరు. ఒకప్పుడు నీటితో కళకళలాడుతున్న ఈ రెండు ఏర్లు ఇప్పుడు చుక్క నీరు లేక మొండిరాళ్లతో ఎడారిలా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అరకొర కురుస్తున్న వర్షాలను పొదుపు చేసుకోవాలన్నా, భవిష్యత్ తరాలు నీటి ఎద్దడిని అధిగమించాలన్నా చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని పేర్కొంటున్నారు. ఈ చెక్‌డ్యామ్‌ల ఏర్పాటు వలన వర్షపునీరు నిలిచి భూగర్భజలాలు పెరుగుతాయి. అలాగే ప్రభుత్వం నీటి వనరులపై శ్రద్ధ చూపి నీటి పథకాలు, ఇంకుడు గుంతలను ప్రోత్సహించాలి. జలవనరులు తక్కువ ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం ప్రోత్సహించడానికి ప్రభుత్వ సబ్సిడీలు పెంచాలని రైతులు చెబుతున్నారు. సేద్యపు నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలి. సమీకృత నీటి నిర్వహణ విధానాన్ని పటిష్ఠంగా అమలు పరచాలి. తద్వారా భవిష్యత్ తరాలకు నీటి ఎద్దడిని లేకుండా కాపాడవచ్చు. ఇకనైనా ప్రభుత్వం నీటి భద్రతపై ఆలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

వ్యవసాయమే ఆధారం..

డిగ్రీ పూర్తి చేసినప్పటికీ పాడి పంటలపై ఉన్న మక్కువతో నాకున్న నాలుగున్నర ఎకరాల్లో మూడెకరాల్లో గడ్డిమొక్కలు నాటాను. ఒకటిన్నర ఎకరాల్లో మామిడి పంటను పండిస్తున్నాను. నా చిన్ననాటి తనంలో వర్షాలు పుష్కలంగా కురుస్తూ గుంజనేరులో ఎప్పుడూ నీరు ప్రవహిస్తుండేది. దీంతో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటూ వ్యవసాయానికి ఆధారంగా ఉండేది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వ్యవసాయం భారంగా మారింది. అరకొర కురుస్తున్న వర్షాలను, నీటిని పొదుపు చేయాలంటే గుంజనేరులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. ప్రభుత్వం పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపట్టాలి.



\- సింగనమల మల్లేశ్వరయ్య, రైతు


గుంజనేరు

గుర్రంకొండలో పట్టపగలే చోరీ

- 20 గ్రాముల బంగారం, రూ.60వేల నగదు అపహరణ
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు


దుండగులు ధ్వంసం చేసిన బీరువా

గుర్రంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణంలో పట్టపగలే వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పగలు తాళం వేసిన ఇళ్లను దుండగులు రెక్కీ నిర్వహించి దోచుకుపోతున్నారు. దీంతో ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. పట్టణంలో నెల రోజుల వ్యవధిలో నాలుగు చోరీలు జరగడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బాధితుల వివరాల మేరకు... పట్టణంలోని బలిజగడ్డకు చెందిన శ్రీనివాసులు వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం వద్ద వ్యవసాయ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసుకొని వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకొని మధ్యాహ్నం 1గంటకు ఇంటికి వచ్చే సమయానికి దుండగులు తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి బట్టలను చిందర వందరగా పడేశారు. అంతేకాకుండా బీరువాలో ఉన్న నగదు, బంగారం వస్తువులను దోచుకుపోయారు. డ్రాలో ఉన్న రూ.60 వేల నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. పక్కనే ఉన్న మరో ఇంటిలో కూడా దుండగులు చోరీకి పాల్పడి ఇంటిలో వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రఘురాం సంఘటన స్థలానికి వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. పది రోజుల క్రితం మరో రెండు ఇళ్లల్లో దుండగులు చోరీ చేసి నగదును దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టణంలో పట్టపగలే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సిద్దవటం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ద్విచక్రవాహనం చోరీకి గురికావడం చర్చణీయంగా మారింది. సిద్దవటం గ్రామంలో బందారుపల్లె ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బాలచంద్ర ఈనెల 4న ఉదయం 9గంటల సమయంలో కడపకు వెళుతూ ద్విచక్ర వాహనాన్ని పోలీసులైను క్రాస్‌రోడ్డులోని పోలీసుస్టేషన్ వెనుకభాగమైన గాలి మిషన్ వద్ద నిలిపివెళ్లాడు. తిరిగి రాత్రి 9 గంటలకు వచ్చేసరికి అక్కడ ద్విచక్ర వాహనం కనపడకపోవడంతో పరిసర ప్రాంతాల్లో విచారించినా వాహనం ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై ఈనెల 5వ తేదీన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం బాలచంద్ర మాట్లాడుతూ 2015లో ప్లాటినా ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసి ప్రతిరోజు గ్రామంలో న్యూస్ పేపర్లు పంపిణీ చేసి అనంతరం కడపలోని ఓ ప్రైవేటు షాపులో పని చేసేందుకు వెళ్తానని, ఈ క్రమంలో తన ద్విచక్ర వాహనాన్ని ఇక్కడ పెట్టి వెళతానన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారని వాపోయాడు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

దర్గా భూ వివాదంలో మహిళపై దాడి


గాయపడిన ముబీనాబీ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాగిమాకులపల్లె క్రాస్ వద్ద ఉన్న మున్వర్‌ఆలీషా ఖాద్రి దర్గా భూ వివాదంలో దర్గా సభ్యురాలు ముబీనాబీపై దాడి జరిగింది. ఈ దాడిలో ముబీనాబీ తలకు తీవ్ర గాయమైంది. దర్గా కమిటీ సభ్యుల వివరాల మేరకు... దర్గా కమిటీ ఛైర్మన్ మున్వర్‌ఆలీషా ఖాద్రీ మృతి తర్వాత దర్గా కమిటీ సభ్యులు, మున్వర్ కొడుకు గౌస్‌పీర్ మధ్య ఛైర్మన్ పదవి కోసం కొన్ని నెలలుగా వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో ఈ దర్గాలో ఉరుసు జరుగనుంది. దీని నిర్వహణ కోసం ఇరువర్గాల మధ్య శనివారం మరోమారు వివాదం చోటుచేసుకోగా ఓ వర్గంవారు ముబీనాబీపై దాడి చేసి గాయపరిచారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మఠం భూముల పరిరక్షణకు చర్యలు

కలికిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడికుర్తి క్రాస్ సమీపంలో ఉన్న శివయోగి మఠం భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం తెలిపారు. రాష్ట్ర జంగం సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ వాసునూరి చంద్రశేఖర్‌తో కలిసి శనివారం ఆయన ఈ మఠం భూములను పరిశీలించారు. విలువైన మఠం భూములకు హద్దులు నిర్ధారించాలని రెవెన్యూ అధికారులను కోరనున్నట్లు విశ్వనాథం తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుంచి ధూపదీప నైవేద్యం నిధుల మంజూరు కోసం వచ్చిన ప్రతిపాదనలకు సంబంధించిన ఆలయాలను ఆయన పరిశీలించారు. మండలంలోని కొటాల గ్రామంలోని సల్లాపురమ్మ ఆలయం, విశ్వేశ్వరాలయం, నల్లగంగమ్మ దేవాలయం, లక్ష్మీనగర్‌లోని మహాలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు మేడికుర్తి క్రాస్‌లోని శివాలయం, రంగనాథపురం రామాలయాలను ఆయన పరిశీలించారు.

వాలీశ్వరస్వామి ఆలయ భూముల సర్వే


ఆలయ భూములు సర్వే చేస్తున్న ఈవో రమణ

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని వాలీశ్వరస్వామి ఆలయ భూములను ఎండోమెంట్ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ ఆలయానికి మొత్తం 124ఎకరాల భూమి ఉంది. ఇందులో 49ఎకరాల భూమిని గత శివరాత్రి సందర్భంగా రైతులకు లీజుకు ఇచ్చారు. మిగిలిన భూమి అన్యాక్రాంతం కాగా వాటి లెక్క తేల్చడానికి శనివారం సర్వే చేపట్టారు. దేవదాయ శాఖ ఈవో రమణ మాట్లాడుతూ ఆలయ భూమిని కొందరు గ్రామస్థులు ఎండోమెంట్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే దురాక్రమణ చేసి సాగు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి భూమి స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని దేవదాయ శాఖకు చెందిన ఇతర ఆలయాల భూమిని కూడా సర్వే చేయించి ఆ భూములను స్వాధీనం చేసుకుని వాటిని లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఈ సర్వేలో ఎండోమెంట్ సర్వేయర్ రమేష్, మండల సర్వేయర్ నరేంద్ర, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాలతి



వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వై.మాలతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ పదోన్నతి పొంది అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ మాలతిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మాలతి మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్థానిక వైద్యులు, సిబ్బందితో సమావేశమై విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని రోగుల పట్ల మర్యాదతో మెలగాలన్నారు.

10లోగా సర్వేను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఈనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో స్వామిత్వ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వే గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకమన్నారు. స్వామిత్వ సర్వేతో గ్రామాల్లో ఆర్థిక, సామాజిక, స్వీయ సాధికారతను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్‌లో ప్రధాని మోదీ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పంచాయతుల్లో సర్వే పూర్తి కాగా మిగిలిన పంచాయతీ సిబ్బంది త్వరతగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈనెల 15వ తేదీలోపల కార్యదర్శులు రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠం, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠం తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా విధానాలపై సీపీఐ నిరసన

బి.కొత్తకోట/ములకలచెరువు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రయోజనాలను, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా దేశ దిగుమతులపై 50శాతం సుంకాన్ని విధిస్తూ అగ్రరాజ్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ సీపీఐ నేతలు శనివారం నిరసన తెలిపారు. పట్టణంలోని జ్యోతి సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎర్రజెండాలతో నిరసన తెలిపారు. అమెరికా పెత్తందారి విధానాలపై మోదీ ప్రభుత్వం మౌనం వీడాలని ములకలచెరువు బస్టాండు వద్ద సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, సహాయ కార్యదర్శి నిజాముద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఊడిగం చేస్తున్న మోదీ దేశ ప్రయోజనాలను దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, రఘునాథ్, బాబు, హబీబ్, షఫీ, గంగులప్ప, సోము మల్లికార్జున, రెడ్డెప్ప, సుబ్బన్న, రవణప్ప, ఉత్తన్న, రామచంద్ర, సరోజమ్మ, నరసమ్మ, శంకరమ్మ, శ్యామలమ్మ, లక్ష్మీదేవి, పాపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గాలికుంటు, బొబ్బల వ్యాధి రాకుండా ముందుగానే పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యుడు డాక్టర్ రామచంద్రుడు సూచించారు. ఆత్మా చిన్నగొట్టిగల్లు బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం తలపులలో పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలంటే పశుపోషణలో ముఖ్యమైన సైలేజ్ తయారీ విధానంపై రైతులకు పూర్తి అవగాహన అవసరమన్నారు. తయారు చేసిన మేతను వాడుకోవడం ద్వారా పాల దిగుబడి 2 నుంచి 3 లీటర్లు పెంచుకోవచ్చన్నారు. పొదుగువాపు వ్యాధి రాకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తద్వారా అధిక నష్టాన్ని అరికట్టవచ్చన్నారు. పుట్టిన దూడలకు 10రోజుల తరువాత నుంచి 6నెలల వ్యవధిలో పలు దఫాలుగా టీకాలు ఇవ్వడం వల్ల దూడలు ఆరోగ్యకరమైన ఆవులుగా ఎదుగుతాయని తెలిపారు. అనంతరం ఆత్మా అందించే కిలో మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. బాహ్య పరాన్న జీవులను అరికట్టే చర్యల్లో భాగంగా ఆవులకు పిడుదుల మందును స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఆత్మా బీటీఎం జ్యోత్స్న, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందిస్తున్న దృశ్యం

మదనపల్లెను ఎప్పటికీ మరువలేను

- ఆ మూడు ప్రాంతాలూ మూడుకళ్లు
- నా జీవితాన్ని తీర్చిదిద్దింది వారిద్దరే
- మదనపల్లె జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న మంత్రి సత్యకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మదనపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'నాకు జీవితంలో అనుభవాలు, జీవిత పాఠాలు, సమాజం పట్ల బాధ్యతలు నేర్పిన మదనపల్లెను ఎప్పటికీ మరువలేను. నాకు మదనపల్లె ఎంత ముఖ్యమో రాజకీయ జన్మనిచ్చిన ధర్మవరం కూడా అంతే ముఖ్యం. మొదట నాకు అనుభవ పాఠాలు నేర్పిన మదనపల్లె నాకు ఒక కన్ను అయితే, జన్మనిచ్చిన పొద్దుటూరు రెండో కన్ను అని, ఇక ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిగా ఆశీర్వదించిన ధర్మవరం మూడో కన్ను' అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఉద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం మదనపల్లెలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. జననం, బాల్యం, విద్యాభ్యాసం, చివరకు రాజకీయ భిక్ష ప్రసాదించిన ఆ మూడు ప్రాంతాల జ్ఞాపకాలు, అనుభవాలను ప్రస్తావించారు. ముఖ్యంగా విద్యార్థి దశలో పోరాటాలు నేర్పిన మదనపల్లె, ఇక్కడి స్నేహితులను పేరుపేరునా గుర్తు చేశారు. ఈ మూడు ప్రాంతాలను ఎప్పటికీ మరువలేనని చెప్పిన మంత్రి ప్రత్యేకంగా మదనపల్లెను ప్రస్తావిస్తూ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తూ ఇక్కడి రుణం తీర్చుకుంటానని ప్రకటించారు. మదనపల్లె సహా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రతిపల్లె, ప్రతి కుటుంబం తనకు తెలుసునని, ఇప్పటికీ వంద కుటుంబాల పేర్లు చెప్పగలనన్నారు. మరోవైపు మదనపల్లె పాలిటెక్నిక్ కళాశాల వేదికగా విద్యార్థి పరిషత్తు కార్యకర్తగా నక్సలిజంపై చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. మొదట్లో తాను పాలిటెక్నిక్ సత్యగా, తర్వాత పొద్దుటూరు సత్యకుమార్‌గా, ధర్మవరంతో సత్యకుమార్ యాదవ్‌గా గుర్తింపు పొందడాన్ని నమ్మలేకపోతున్నట్లు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. తనకు తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యార్థి దశలో బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, దేశ రాజకీయాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పరిచయం చేశారని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా మదనపల్లె పేరును ప్రస్తావిస్తే, తాను ఉద్వేగానికి లోనవుతానని, అలాంటి స్థానం కల్పించినందుకు జీవితాంతం రుణపడి ఉంటానని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు చల్లపల్లె నరసింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ఎన్.రమేష్‌నాయుడు, దినకర్, ఎన్.సేతు, గుత్తి హరికృష్ణ, జబ్బల శ్రీనివాసులు, టీడీపీ నేతలు రాటకొండ బాబురెడ్డి, కొపూరి మల్లికార్జుననాయుడు, నాదెళ్ల విద్యాసాగర్, గొల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, ఎంఆర్‌పీఎస్ నరేంద్ర, జంగాల శివరామ్, శ్రీరామ రామాంజనేయులు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కూటమి నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

30 పడకల ఆసుపత్రిని నిర్మించాలి

సుండుపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా నిర్మించాలని, అందుకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాస్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. శనివారం రాజంపేట నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రి సత్యకుమార్‌ను టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సుండుపల్లె మండలం 15 గ్రామ పంచాయతీలతో సుమారు లక్షకు పైగా జనాభా కలిగి ఉందని, కానీ సరైన వైద్యం లేక సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, అందుకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో లేకపోవడమేనని వివరించారు. 24 గంటలు సేవలు అందించే 30పడకల ఆసుపత్రిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, బీజేవైయం జిల్లా నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు
- అధికారులు, ట్రేడర్స్, రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధరల నిర్ణయం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి నేతాజి సర్కిల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరాని కంటే మించి యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కథనాలతో రైతులను ఆందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, ట్రేడర్స్ రైతు సంఘాల సమన్వయంతో బొప్పాయి ధర నిర్ణయించబడుతుందని, బొప్పాయి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 44శాతం లోటు వర్షపాతం నమోదు అయిందని, దీని వల్ల 57 వేల హెక్టార్లకు గాను కేవలం 10600 హెక్టార్లల్లో సాగు చేస్తున్నారన్నారు. దీంతో 18శాతం మాత్రమే సాగువుతోందని సెప్టెంబర్ 6 నాటికి ప్రవేటు డీలర్ల వద్ద 518 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రంలో 460 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. 10600 హెక్టార్లు అనగా సుమారు 25 వేల ఎకరాలకు గాను ప్రస్తుతం అందుబాటులో ఉన్న 978 మెట్రిక్ టన్నుల యూరియా సరిపోతుందన్నారు. వచ్చే వారంలో 4000మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. ఎంఎస్ స్వామినాధన్ లాంటి వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించినట్లుగా రసాయనిక ఎరువులను అవసరానికి మించి వినియోగించడం వల్ల భూమి సారవంతం తగ్గుతుందన్నారు. జిల్లాలో 4000 మంది రైతులు 11వేల ఎకరాలల్లో బొప్పాయి పంట పండిస్తున్నారని, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో బొప్పాయి సాగు అధికంగా ఉందన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఛైర్మన్ రూపానందరెడ్డి రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి 9 రూపాయలతో బొప్పాయి ధర నిర్ణంచారన్నారు. ఢిల్లీలో ఏ ధరైతే ఉంటుందో దానికి అనుగుణంగా ధర నిర్ణయించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ రైతులను రెచ్చకొట్టడం నేరమన్నారు. సోషియల్ మీడియాలో తప్పుడు కథనాలు రాస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

పీలేరు రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం పీలేరు కోర్టు ఆవరణలో పీలేరు, కలకడ, భాకరాపేట, సదుం, రొంపిచెర్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో సివిల్, క్రిమినల్, మోటారు వాహన కేసులు, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్ తదితర కేసులు పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు, ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు సహకరించాలని పిలుపునిచ్చారు. రాజీ కాదగిన క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. సమష్టి కృషితో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని, ఇందులో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని జడ్జి సూచించారు. సమావేశంలో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్, కలకడ సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐలు లోకేశ్, సుబ్బారెడ్డి, బాలక్రిష్ణయ్య, షేక్‌షావల్లీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్ జియావుద్దీన్

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఓఈలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (మూడేళ్ల, ఐదేళ్ల) మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం సాయంత్రం తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఎల్‌బీ (ఐదేళ్ల) మొదటిసెమిస్టర్ పరీక్షల్లో 50 శాతం మంది, ఎల్ఎల్‌బీ (మూడేళ్ల) మొదటి సెమిస్టర్ ఫలితాల్లో 17శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కెఎస్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

బ్యూటీషన్, టైలరింగ్‌పై.. మహిళలకు ఉచిత శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 31 రోజుల పాటు టైలరింగ్, 35 రోజుల పాటు బ్యూటీపార్లర్ రంగంలో మహిళలకు ఉచితంగా ఇస్తున్నట్లు డైరెక్టర్ వి. అప్సర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు పైశిక్షణ కార్య క్రమాలకు అర్హులని, గ్రామీణప్రాంత మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. శిక్షణకు సంబంధించి మరిన్ని వివరాలకు 9440905478, 9985606866, 94409 33028 నెంబర్లకు ఫోను చేసి తెలుసుకోవచ్చన్నారు. దూర ప్రాంతాలవారికి ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు.

వెల్లాల ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న బండి ఆంజనేయులు

రాజుపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ సంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం కడప జిల్లా సాయిపేటకు చెందిన బండి దేవకి, ఆంజనేయులు దంపతులు రూ.2లక్షలు విరాళం అందజేశారు. పాలకమండలి సభ్యులకు ఈచెక్కు అందించారు. అంతకుముందు ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గండికోట ప్రాజెక్టుకు తగ్గిన కృష్ణాజలాల ప్రవాహం

కొండాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎస్ఎస్ వరదకాలువ ద్వారా గండికోట ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో శనివారం నుంచి తగ్గినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఇది వరకు సుమారు 11,000 క్యూసెక్కుల వరకు కృష్ణాజలాలు వస్తుండగా, ప్రస్తుతం 6,000 క్యూసెక్కులకు తగ్గిందన్నారు. అదే విధంగా గండికోట నుంచి మైలవరం జలాశయానికి వెళ్లే నీటిని 10,000 క్యూసెక్కుల నుంచి 5,000 క్యూసెక్కులకు తగ్గించినట్లు ఈఈ తెలిపారు. దీంతోపాటు సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు, కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 23.741 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

బాకీ పేరుతో బెదిరింపులు

- ఆగ్రహించిన వ్యాపారులు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

యాడికి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాకీ వున్నారు... డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రాయలచెరువులో చోటుచేసుకుంది. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన సయ్యద్ గౌస్‌బాషా శనివారం సాయంత్రం పలు దుకాణాల వద్దకు వెళ్లి డబ్బులు బాకీ వున్నారు, ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగాడు. పలు పెయింట్ షాపుల వద్దకు వెళ్లి బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆగ్రహించిన షాపు యజమానులు అతడికి దేహశుద్ధి చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామంటూ బెదిరించాడని వ్యాపారులు ఆరోపించారు. విషయం పోలీసులకు సమాచారం తెలపగా అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలేవి ?

- సంవత్సరాలు గడిచినా చర్యలు శూన్యం
- అనర్హత గల అధికారి పాత్రపై అనుమానం
- ప్రభుత్వాలు మారినా పట్టించుకోని అధికార యంత్రాంగం

కడప ఎన్టీఆర్ సర్కిల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో నిధులు పక్కదారి పడుతున్నాయి. సంవత్సరాలు గడిచినా అక్రమార్కులపై చర్యలు లేవు. జిల్లాలో పలుచోట్ల డ్వాక్రా సంఘాల్లో అవినీతి అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో కొన్ని చోట్ల అప్పటికప్పుడు ఆరోపణలు వచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవడం జరిగింది. అయితే భారీ స్థాయిలో నిధుల గోల్‌మాల్ జరిగి సంవత్సరాల కాలం దాటిపోతున్నా కేవలం ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్న అధికార యంత్రాంగం ఆ తరువాత ఆ విషయాన్ని మరుగున పడేశారు.

వల్లూరు మండలంలోని వెలుగు పథకంలో దాదాపు రూ.80లక్షల మేర అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టడమే కాకుండా కలెక్టరు సూచనల మేరకు థర్డ్ పార్టీ ఎంక్వయిరీ కూడా నిర్వహించారు. అయితే ఈ విచారణలో ఒక కమ్యూనిటీ కోఆర్డినేటరు తన సొంత ఖాతాకు నిధులు మళ్లించుకుని దుర్వినియోగానికి పాల్పడినట్లు వెల్లడైంది. అయితే అదే విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని నిధుల అక్రమాల్లో అప్పటి ఏరియా కోఆర్డినేటరు బి.సత్యనారాయణ పాత్ర ఉందని.. ఆయన చెబితేనే తాను నిధులు డ్రా చేసి తీసుకెళ్లి ఇచ్చానని ఆమె విచారణ అధికారికి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంటు ఇచ్చినట్లు సమాచారం.



డీఆర్‌డీఏ ఆఫీసు

అయితే ఇందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏరియా కోఆర్డినేటరు అన్నమయ్య జిల్లా ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేస్తుండడం వల్ల చర్యలు తీసుకోనట్లుగా స్పష్టమవుతుంది. అంతేకాకుండా గతంలో ఉన్న పీడీ కేవలం నోటీసులు ఇచ్చి సరిపుచ్చారనేది సమాచారం. అయితే రూ.80లక్షలకు పైగా నిధులు పక్కదారి పడితే కేవలం రూ.20లక్షలు మాత్రమే కమ్యూనిటీ కోఆర్డినేటరు పాత్ర ఉందని రికవరీ పెట్టారు.

మిగిలిన నిధులు ఏమైనట్లు?

వల్లూరు మండలంలో పక్కదారి పడుతున్న నిధుల్లో రూ.20లక్షలు కమ్యూనిటీ కోఆర్డినేటరు నుంచి వసూలు చేసేట్లు డీఆర్‌డీఏ అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కొంత మేర ఆమె నుంచి దశల వారీగా వసూలు చేసినట్లు తెలుస్తోంది., అయితే మిగిలిన మొత్తం ఎటు పోయినట్లు, ఏమైనట్లో అర్థం కాని పరిస్థితి. ఇంత కాలం అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై కూడా పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వల్లూరు మండల సమాఖ్య ప్రతినిధులు కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ కేసులో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తాయని చర్చ జరిగింది. కానీ యథావిధిగా నిధుల దుర్వినియోగంపై మౌనమే రాజ్యమేలుతుంది. ఒక వల్లూరు మండలంలోనే కాకుండా అట్లూరు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో వెలుగు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి నిధుల స్వాహాకు తెరలేపినట్లు ఆరోపణలు లేకపోలేదు. అయితే అన్నమయ్య జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న సత్యనారాయణపై సెర్ప్ చర్యలకు ఉపక్రమించింది. అక్కడ కూడా ఇసుక క్వారీలో అక్రమాలు చోటు చేసుకోవడంపైనే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో వల్లూరు మండలంలో ఆగిపోయిన విచారణ ఇక నుంచైనా ముందుకు సాగుతుందా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నమోదు కాని కేసు

వల్లూరు మండలంలో పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని మండల సమాఖ్య సభ్యులు గతంలో వల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ అప్పట్లో వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలు జోక్యం చేసుకోవడంతో కేసు నమోదు చేయకుండా ఫిర్యాదు పక్కనపెట్టారు. తరువాత కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా కేసు నమోదు కాని పరిస్థితి. జిల్లా కలెక్టరు చొరవ తీసుకుని ప్రభుత్వాలు మహిళాభివృద్ధి కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టే అంశంపై దృష్టిసారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ నిధుల దుర్వినియోగం, కేసు ఫిర్యాదులపై విచారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై కడప డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

క్షణికావేశంలో జీవితాలను పాడు చేసుకోవద్దు

- 5కే రెడ్ రన్‌లో యువతకు డీఎంహెచ్‌వో పిలుపు

కడప కలెక్టరేట్ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసే తప్పిదాలతో మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు యువతకు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా శాఖల ఆధ్వర్యంలో యూత్‌ఫెస్ట్ 2025-26లో భాగంగా 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ 5కే రెడ్ రన్ మారథాన్ మహవీర్ సర్కిల్ నుంచి రిమ్స్ బ్రిడ్జి వరకు, అక్కడ నుంచి తిరిగి మహవీర్ సర్కిల్ వరకు సాగింది. కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతీ యువకులు హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష తగదని అదనపు డీఎంహెచ్‌వో రవిబాబు పేర్కొన్నారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌కు చికిత్స ఉందని, దీనిపై సందేహాలుంటే సమీపంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత పరీక్షలు చేసుకోవాలన్నారు. 5కే రెడ్ రన్ పోటీల్లో మొదటి బహుమతి సింహాచలం, రెండో బహుమతి సికిందర్‌లు గెలుపొందారు. అమ్మాయిల విభాగంలో శ్రీశకు ప్రథమ బహుమతి, రెండో బహుమతి కీర్తి, ట్రాన్స్‌జెండర్ విభాగంలో మొదటి బహుమతి పింకి, రెండో బహుమతి మహేష్‌లు గెలుపొందారు. ఈసందర్భంగా జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాస్కర్ విజేతలను అభినందించారు. జిల్లా క్రీడలశాఖాధికారి జగన్నాథరెడ్డి యువత ఆరోగ్యం, నైపుణ్యాలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ గురవయ్య, సుబ్బరాయుడు, రమేష్ వెంకటరెడ్డి, అమృత్, కళ్యాణ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



5కే రెడ్‌రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫాతిమా కాలేజీ సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 30 నుండి 35 సంవత్సరాలు వయసు ఉంటుందని, బ్లూకలర్ టీషర్టు ధరించి నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తుపట్టి.. ఏదైనా సమాచారం ఉంటే 9440627658, 94409 00811కు ఫోను చేసికడప రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డికి తెలపాలన్నారు.

వ్యక్తిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

పులివెందుల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలమవారిపల్లెకు చెందిన రుత్విక్‌నాయుడు అనే వ్యక్తిపై నగరిగుట్టకు చెందిన రాజేష్‌తో పాటు మరికొంతమంది దాడి చేశారు. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి అనే అతనితో తిరుగుతున్నాననే కారణంగా తనపై దాడి చేశారని రుత్విక్ నాయుడు ఆరోపించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బాలికపై అత్యాచారం... యువకుడి అరెస్టు

- పోక్సో కేసు నమోదు

వేముల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో యువకుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి.. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఉలసయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. వారి వివరాల మేరకు... వేములకు చెందిన కుంచెపు వెంకట రమణ అనే యువకుడు ఇంటర్ మధ్యలో ఆపేసి బేల్దారి పనిచేసుకుంటున్నాడు. నాలుగు నెలల నుంచి ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. గత నెల 30వ తేదీ బాలికను బలవంతంగా తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉలసయ్య

కేవీకేకు నాలుగు అవార్డులు

సీకేదిన్నె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు అవార్డులు లభించినట్లు కేవీకే సమన్వయకర్త అంకయ్యకుమార్ శనివారం తెలిపారు. తమిళనాడులోని వేలూరులో సెప్టెంబరు 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన జోనల్‌స్థాయి కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక కార్యాచరణ కార్యశాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరుకు నాలుగు పురస్కారాలు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. అందులో షెడ్యూలు కులాల ఉపప్రణాళిక పథకాన్ని విజయవంతంగా జిల్లాలో అమలుపరిచినందుకు ప్రథమస్థానం, జిల్లాలో అత్యుత్తమ ఫొటో విభాగంలో ప్రథమస్థానం, జిల్లాలో మినుములో పల్లాకు తెగులు తట్టుకునే రకాలను విస్తరించినందుకు ప్రథమస్థానం, అపరాల ఆదర్శ గ్రామం పథకాన్ని విజయవంతంగా నడిపిస్తున్నందుకు మూడవస్థానం దక్కినట్లు తెలిపారు. ఈ పురస్కారాలను వ్యవసాయ సాంకేతిక అనే ప్రయోగ సంస్థ, జోన్-10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ సమక్షంలో అందజేశారన్నారు. ఈ పురస్కారాలు రావడానికి కృషి చేసిన ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, విస్తరణ సంచాలకులు శివనారాయణ, పరిశోధన సంచాలకులు తులసిలకు అభినందనలు తెలిపారు. అదే విధంగా కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ అవార్డులు దక్కాయన్నారు.

గండిక్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు

రూ.4లక్షల ఆదాయం

చక్రాయపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండిక్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామిని దర్శించుకునేందుకు శనివారం భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వివిధ ఆర్జితసేవల ద్వారా రూ.4,03,348 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈసందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, 1500 మంది అన్నప్రసాదంలో పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, ఆదివారం చంద్రగ్రహణం కారణంగా సాయంత్రం 4గంటల నుంచి ఆలయాన్ని మూసివేస్తాన్నారు. తిరిగి సోమవారం 7గంటల నుంచి స్వామి వారి సర్వదర్శనం ప్రారంభమవుతుందని తెలిపారు.

పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలను అధిగమించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

కడప రూరల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పిల్లల రక్షణ చట్టాల అమలులో ఆయా శాఖల అధికారులు సమస్యలను అధిగమించి తద్వారా లక్ష్యసాధనకు పాటుపడాలని డీఎల్ఎస్ఏ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాదన్‌లో పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిపార్ట్‌మెంట్‌ల వారీగా సమస్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. బాల్య వివాహాలు, గర్భధారణ, పిల్లల ఆరోగ్యం, విద్య, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు, తదితర అంశాలపై చర్చించారు. జేజేబీ చట్టం 2015, పోక్సో చట్టం 2012, పీసీఎంఏ 2006, బాల కార్మిక చట్టం 1986 తదితర చట్టాల గురించి తెలియపరిచారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగస్ హెల్ప్‌లైన్ నెంబర్ 14456 తెలియపరిచారు. సమావేశంలో ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కె.భార్గవి, కడప జిల్లా డీఆర్‌వో, కడప, అన్నమయ్య జిల్లాల ఏఎస్పీలు, డీఎంహెచ్‌వో, సోషల్‌వెల్ఫేర్, లేబర్ డిపార్ట్‌మెంట్, సర్వశిక్ష అభియాన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి

- కలెక్టరుకు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి వినతి



కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. శనివారం కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిసి ఆ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల నుంచి పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీని సకాలంలో అందజేయాలన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కుడా)నిధులు విడుదల చేయాలన్నారు. నిధుల లేమితో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయన్నారు. గ్రామాల్లో కనీసం పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నా నిధులు లేవన్నారు. సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

NEUROLOGIST

డా.కె.నిరంజన్ బాబు, M.D (Med), D.M (Neuro) పక్షవాతం (Stroke), I.C.U (24hrs), ఫిట్స్ (మూర్ఛ) తలనొప్పి, మైగ్రేన్ తలతిరుగుట, తిమ్మిర్లు, మెడ, నడుము, కండరాలు నొప్పులు, సంప్ర. సాయి నారాయణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, DBR హాస్పిటల్ వెనుక, కొర్లగుంట, తిరుపతి సెల్ : 94944 03825.
AJT - 239969

PLOTS FOR SALE

నేషనల్ హైవేలకు అనుకొని తిరుపతిలో తుడ ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అన్నీ వసతులతో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ ఓనర్. ఫోన్ : 95027 74175 / 79959 92114
AJT - 1598

WANTED

Graduates with WhatsApp Marketing, Tele-Sales experience with own Laptop required for a short term project for non-profit organization. Contact 8500960577
AJT - 1600

HEALTH CARE

డా॥కె.కీర్తన(M.D., Pediatrics, SVMS &Ex Senior Resident, RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్న పిల్లల వైద్యనిపుణులు. 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. శ్రీ విష్ణు చిన్న పిల్లల హాస్పిటల్, మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డికాలనీ, తిరుపతి. సెల్: 63035 53359
AJT -1599

WANTED

తిరుపతి ప్రముఖ ట్రావెల్స్ నందు నెలవారీ జీతానికి పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. ఆసక్తి గలవారు డ్రైవింగ్ లైసెన్స్‌తో సంప్రదించగలరు. సెల్:73374 56808
AJT -246064

TOLET

Single Bachelor room, Bath attached in 19-9-61, B1 Old Tiruchancor Road, Opp. Electrical DE Office, Vijayalakshmi Colony, Tirupati. Cont. : 8074 282 118.
AJT - 215592

WANTED

మీరు 10th క్లాస్ పాస్ అయి ఉన్నారా! అయితే LIC భీమాసఖీ (జీతం+ కమీషన్) కొరకు సంప్రదించండి. AKCS రెడ్డి, LIC of India, Tirupati. Cell:90599 19948
AJT - 1593

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246588

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడీవిటి

ప్రణాళికాబద్ధంగా రహదారుల అభివృద్ధి

- రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి

కడప రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తున్నారని... అందుకు అనుగుణంగా అధికారులు పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని రహదారులు, భవనాలశాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ మేరకు నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవల కురిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు, వాటి అంచనా విలువపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలను పంపాలని ఆదేశించిందన్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి కడప జిల్లాలోని వివరాలను ఆయన ఆడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వర్షాకాంలో రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే పనులు చేపట్టేందుకు ప్రణాళికలను తయారు చేసి పంపాలన్నారు. నిధులు మంజూరు కాగానే ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎస్ఈ వై.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వర్షాలకంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు, లేయర్లకు సంబంధించి వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి రూ.235 కోట్లు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట డివిజన్‌కు సంబంధించి రూ.37 కోట్ల మేర ప్రతిపాదనలను పంపామని తెలిపారు.

రహదారుల పరిశీలన

జిల్లాలోని పలు రహదారులను రహదారులు భవనాల శాఖ ఈఎన్‌సీ వివేకానందరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతకొమ్మదిన్నె మండలంలోని ఎన్టీపీసీ నుంచి కడప నగరం 18వ డివిజన్‌లోని విశ్వనాథపురం రైల్వే గేటు వరకు ఉన్న ఆర్అండ్ బీ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ టక్కొలి కృష్ణారెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయకులు ఎం. మునీంద్రయాదవ్, స్థానిక నాయకులు కలిసి ఈ రహదారి పనులకు రూ.12 కోట్లతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని త్వరలో నిధులు మంజూరు చేసి పనులను ప్రాంభించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ వై.నాగేశ్వరరెడ్డి, డీఈ కళ్యాణి, శేషావలి, తదితరులు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె మండలం ఎన్టీపీసీ నుంచి విశ్వనాథపురం వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వివరాలను ఈఎన్‌సీ వివేకానందరెడ్డికి తెలియజేస్తున్న టీడీపీ నేతలు

బై బై గణేశా

అశేష భక్తజనం నడుమ నిమజ్జనానికి తరలిన వినాయక ప్రతిమలు



బి.కొత్తకోట జ్యోతిసర్కిల్‌లో కోలాహలంగా వినాయకుడి ఊరేగింపు



వాల్మీకిపురంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమ

వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద శనివారం చివరి రోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీ, తోటవీధి, కొత్తపేట వీధి, బజారు వీధి, గాంధీపేట, కొత్త ఇందిరమ్మ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను అశేష భక్తజనం నడుమ నగరోత్సవం కోలాహలంగా సాగింది. బళ్లారి డప్పు వాయిద్యాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది నిమజ్జన ఉత్సవాలు మతసామరస్యంతో కలిసి కట్టుగా చేసుకోవడం విశేషం. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం నుంచీ సాగిన నగరోత్సవం సాయంత్రానికి పూర్తి చేసి గడ్డికుంట ప్రాంతం, నిమ్మనపల్లె బాహుందా ప్రాజెక్టులకు ప్రతిమలను తరలించి నిమజ్జనం చేశారు. సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

కొనసాగుతున్న ఊరేగింపు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. చవితి వేడుకకు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం పట్టణంలో సీటీఎం రోడ్డు మమత కల్యాణ మండం వీధిలో యువకులు వినాయక నిమజ్జనానికి ప్రత్యేక వాహనంలో అలంకరించి ఊరేంచారు. చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా పేలుళ్లతో ఊరేగింపు సాగింది. అనంతరం తట్టివారిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. గొల్లపల్లె బైపాస్‌లోని హరిజనవాడలో విఘ్నేశ్వరుడిని విశేషంగా పూజలు చేసి అనంతరం పురవీధుల్లో ఊరేగించారు. యువకులు కోలాహలంగా వినాయకుడిని నిమ జ్జనానికి తరలించారు.



శంకర్ టాకీస్ సెంటర్లో నగరోత్సవం

బి.కొత్తకోటలో అట్టహాసంగా....

బి.కొత్తకోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బెంగళూరురోడ్డు యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి నిమజ్జనం శనివారం అట్టహాసంగా జరిగింది. పట్టణంలో దీర్ఘకాలం కొలువుదీర్చి, రోజూ అన్నసంతర్పణ, ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేపట్టిన యువత లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయకుండా లక్కీడిప్ తీసి విజేతకు లడ్డూ సహా భగవద్గీతను బహూకరించారు. మేళతాళాలు, బళ్లారిడ్రమ్స్, బాణసంచా పేలుళ్లు, యువకులు నృత్యాలు, భక్తాదుల నినాదాల నడుమ అట్టహాసంగా సాగింది. బెంగళూరు రోడ్డు, జ్యోతిసర్కిల్, మదనపల్లి రోడ్డు, దిగువబస్టాండు మీదుగా జరిగిన వినాయకుడి శోభాయాత్రను పట్టణప్రజలు చూసి తరించారు. కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులతో పాటు వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

‘పీపీపీ’తో వైద్యసేవలు మెరుగు : ఆర్‌జే



విలేకర్లతో మాట్లాడుతున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 10 మెడికల్ కాలేజీలను ‘పీపీపీ’ విధానం అమలు చేస్తూ నిర్మాణాలు పూర్తిచేయడం, తరగతులు ప్రారంభించేందుకు తీసుకున్న నిర్ణయంతో వైద్య సేవలు మెరుగుపడతాయని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ అన్నారు. నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణంపై వైసీపీ, బీఎస్పీ, సీపీఎం నేతలు ఎమ్మెల్యేను రాజీనామా చేయమని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. 2022లో మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏడాదిన్నరగా కనీసం ఆరోగ్యవరం వద్ద చదును పనులు కూడా చేపట్టలేదని గుర్తు చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం నాబార్డు నిధులు తీసుకురాలేక చతికలబడిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విజిట్ చేయించి, అబాసు పాలైందన్నారు. రాష్ట్రం ఆర్థిక భారంతో వున్నా ‘పీపీపీ’తో మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఉనికిని చాటుకునేందుకు మదనపల్లె వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం ప్రెస్‌మీట్లు పెట్టారని ఎద్దేవా చేశారు. టీడీపీ మహిళా నాయకురాళ్లు విజయమ్మ, ఉషారాణి, నాగమణి, ప్రమీలమ్మ, రాటకొండ భారతి, గణేశ్, మల్లికార్జున, భువనేశ్వర్‌రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిన టీడీపీ నేతలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న దేరంగుల చంద్ర

తంబళ్లపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, కల్పనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్త్రీ శక్తి విజయోత్సవ సభకు మండలం నుంచి 3 బస్సులు, వాహనాల్లో మహిళలు, టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. శనివారం ఉదయం పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, టీడీపీ నేతలు, కార్యకర్తలతో సూపర్ సిక్స్- సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ విజయవంతమైంది.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న ఎరుకల హక్కుల పోరాట సమితి సభ్యులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి అమవాస్య రమణ విద్యార్థులకు సూచించారు. శనివారం సమితి సభ్యులతో కలిసి స్థానిక బాలుర గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పిల్లలకు అందుతున్న మౌలిక వసతులు, విద్య, వైద్యం, భోజన సౌకర్యాల గురించి ఆరాతీసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గురుకులంలో మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యాబోధన అందించి విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి అమవాస్య రెడ్డయ్య, మండలాధ్యక్షుడు రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి మృతి



రామకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీరామ్‌చినబాబు

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ గుండ్లపల్లె రామకృష్ణారెడ్డి(81) శనివారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామకృష్ణారెడ్డి టీడీపీ ఆవిర్భావం నుంచీ ఉంటూ మూగవాడి పంచాయతీకి మూడుసార్లు సర్పంచ్‌గా, 2000-2005లో టీడీపీ మండల వైస్ ఎంపీపీగా పనిచేశారు. పలమనేరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, మదనపల్లె టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు విద్యాసాగర్, ఎన్.శ్రీనాథరెడ్డి, రామసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు విజయ కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చిన్నస్వామి, కాంట్రాక్టర్ రెడ్డెప్పరెడ్డి, రాటకొండ మధుబాబు, సాగర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వమునివెంకటస్వామి, సర్పంచ్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ తిప్పన్న, డాక్టర్ శివ, విశ్వనాథనాయుడు, పెంచుపాడుస్వామి, శివ, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

In the Court of the Addl Senior Civil Judge of Madanapalle

O.E.P No.57/2016 in O.S No.108/2014

B.Hare Ramaiaha (died) & others ...**Dhrs**

Vs

S.Khadar Hussain (died) & others ... **Jdrs**

Sale Notice to Jdr No.4

Jdr No.4: Sadiq, S/o Khadar Hussain, Saidapeta, madanapalle.

Please take notice that the above O.E.P is filed for sale of the E.P Schedule for recovery of the decree amount, and sale notice was ordered to you and the matter posted to **15-09-2025** and it will be called by 10-30 AM in the Court, and you must be present either in person or through an Advocate, and if you fails to present before the Court, the matter will be decided Expartly.

// By Order of the Court //

Surabhi Rama Gopal Rao,

Advocate/Notry/Receiver, Madanapalle.



దేశానికి వెన్నెముక గురువులే

ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్

పీలేరు రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశానికి వెన్నెముక గురువులేనని పీలేరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియవుద్దీన్ షేక్ తెలిపారు. శనివారం కోటపల్లె జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ తల్లి తండ్రి తరువాత దైవంగా భావించేది గురువులేనని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆల్‌రౌండ్ ప్రతిభ కలిగి ఉండాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఉజ్వల భవిత కోసం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



సిద్దారెడ్డిని సన్మానిస్తున్న మండల విద్యాశాఖ

పెద్దమండ్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ నుంచి అవార్డు అందుకున్న సిద్దారెడ్డికి శనివారం పెద్దమండ్యం హైస్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. గుడిసివారిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దారెడ్డిని మండల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎంఈఓలు మనోహర్, రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘం నేతలు సురేంద్రనాధరెడ్డి, కృష్ణయ్య, సీవీరమణ, చలపతి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

తొగట కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొగట కార్పొరేషన్ ఏర్పాటు చేసి తొగట అభ్యున్నతికి కృషి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో స్టేట్ ఎడ్యుకేషన్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ రాజశేఖర్‌కు తొగటవీర క్షత్రియ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి రామూర్తి, కోశాధికారి శ్రీనివాసులు, రాయలసీమ అధ్యక్షుడు బొమ్మల వెంకటరత్నం, జిల్లా అధ్యక్షుడు భోజనపు వెంకట నారాయణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు మందపల్లె బాబు, జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బాలయ్య, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పురం మల్లయ్య కలిసి వినతిపత్రం అందజేశారు.

జీవనశైలి మార్పుతో వ్యాధులు దూరం

వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవనశైలి మార్పుతో వ్యాధులను నియంత్రించవచ్చని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖాబేగం పేర్కొన్నారు. తాటిగుంటపల్లెలో 104 సేవల్లో భాగంగా ప్రజలకు అవగాహన చేపట్టిన ఆమె మాట్లాడుతూ చక్కటి జీవనశైలి పాటిస్తే రక్తపోటు, షుగర్, క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం వంటి జబ్బులను నియంత్రణ చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫి, సీహెచ్‌ఓ అరుణ, వైద్య సిబ్బంది, ఆరోగ్య, ఆశావర్కర్లు, 104సిబ్బంది పాల్గొన్నారు.

‘యూరియా పంపిణీపై అవగాహనలేని ప్రచారం’

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ శాఖాధికారులు పంపిణీ చేస్తున్న యూరియాపై అవగాహన లేకుండా మండల వైసీపీ నేతలు ఫేక్ ప్రచారం చేస్తున్నారని తమ ఉనికిని కాపాడుకోవడం కోసం వైసీపీ నేతలు రైతులను పావుగా వాడుకుంటున్నారని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్ ఆరోపించారు. యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రెండు రోజుల కిందట మండల వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని ఖండిస్తూ శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు వక్రీకరిస్తూ వైసీపీ నేతలు రైతులను స్వప్రయోజనాల కోసం వాడుకోవడం మానుకోవాలని హితవు పలికారు.

మనమిత్రపై అవగాహన కల్పించండి

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. శనివారం ఆయన పీటీఎం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మనమిత్రపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన మనమిత్ర ద్వారా అనేక సేవలను పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా వివిధ రకాల సేవలను ఇంటి నుంచే పొందే వెసులుబాటు కల్పించందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది ప్రజల్లో ఈ సేవలపై మరింత విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, సంపతికోట కిట్టన్న, చిన్నపరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో పాటు బోరుమెకానిక్ చంద్ర, గట్టు చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి : మంత్రి

కురబలకోట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అంగళ్లులో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కూడలిలో బీజేపీ జెండాను ఆయన ఆవిష్కరించారు. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ కృష్ణుడి బొమ్మను ఆయనకు బహూకరించారు. బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, రాజంపేట బీజేపీ నేత సాయిలోకేష్, తంబళ్లపల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, విజయభారతి కరెస్పాండెంట్ ఎం. సేతు, సీతారామ్, బీజేపీ నేతలు గోపాల్‌రెడ్డి, బావాజాన్, రాజారెడ్డి, రమణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో మంత్రికి ఘనస్వాగతం



మంత్రి సత్యకు స్వాగతం పలుకుతున్న మల్లికార్జుననాయుడు

మదనపల్లె, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పర్యటనకు విచ్చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. రాజంపేట నుంచి విచ్చేసిన మంత్రికి అంగళ్లులో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కోపూరి మల్లికార్జున నాయుడు ఘనస్వాగతం పలికారు. మదనపల్లె అన్నమయ్య సర్కిల్‌లో మంత్రి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ శ్రేణులు, కూటమి నేతలు, కార్యకర్తలు శ్రీకృష్ణ కళ్యాణ మండపం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పెద్దమండ్యం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టడానికి సమష్టిగా కృషి చేయాలని మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నౌజియాబేగం పిలుపు నిచ్చారు. కలిచెర్ల హైస్కూల్‌లో శనివారం సెక్టార్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులతో సంకల్పం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడానికి యత్నిస్తే ప్రజలు జీఎస్ మహిళా పోలీసులకు, అంగన్‌వాడీ కార్యకర్తల దృష్టికి తీసుకు రావాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో ఆకతాయి వివరాలు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. కలిచెర్ల హెచ్‌ఎం మీనా నాగలక్ష్మీ, శ్రీవిద్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి

వాల్మీకిపురం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మంచి నడవడికను అలవర్చు కోవాలని వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ భారతి పేర్కొన్నారు. శనివారం జడ్పీ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి ద్వారా సంకల్ప్ అవగాహనలో ఆమె మాట్లాడుతూ రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక పునరుత్పత్తి, ఆరోగ్యం, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, టోల్‌ఫ్రీ నెంబరు 112, 181 తదితర వాటిపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బస్టాండులో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆటో డ్రైవర్లు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఆటోను నడుపుతూ వారి కుటుంబాలను పోషిస్తున్నారని తెలిపారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లు నష్టపోకుండా ప్రభుత్వం ఏడాదికి రూ.25వేలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 16న కలెక్టరేట్‌లో జరగబోయే మహాధర్నాకు ఆటో డ్రైవర్లు రావాలని పిలుపు నిచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ ఆవిష్కరణ



విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కురబసంఘ సభ్యులు

రామసముద్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మట్లవారిపల్లెలో కొలువైన సిగరేశ్వర, బత్తేశ్వర ఆలయంలో భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను కురబ సంఘ నేతలు ఆవిష్కరించారు. అక్టోబరు 5న ఆదివారం తిరుపతిలో భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణ నిర్వహిస్తున్నామని, కురబ కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సంఘ నేతలు వల్లిగట్ల వెంకటరమణ, మంగిరి రెడ్డెప్ప, గెవన్న, కోవా కృష్ణమూర్తి, ఎంపీటీసీ రెడ్డెప్ప, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, సీపీఐ నాగప్ప, దొరబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

11న విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఏపీ కాంగ్రెస్ కమిటీ కార్యాలయం ఆంధ్రభవన్‌లో నిర్వహిస్తున్నట్లు కమిటీ ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరూ తెల్లపంచ, వైట్ షర్ట్, ఆకుపచ్చ కండువాలు ధరించి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాదిలో మామిడి రైతులు ఏపీలో చాలా నష్టపోయారని, 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా టోకు మామిడి దరల ఫలితంగా లక్షలాదిమంది మామిడి రైతులు నష్టాలు చూడాల్సి వచ్చిందన్నారు. ఈ ఏడాది మామిడి పంటను అడిగేవారు లేకుండాపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళ భరిత పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ హనుమన్నకు ప్రత్యేక పూజలు



కలకడ సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాటవారిపల్లెలో కొలువైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమన్నను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, ఆకు పూజ జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

డిప్యూటీ ఎంపీడీఓకు పదోన్నతి



పీలేరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓ నిమ్మనపల్లె లతీఫ్ ఖాన్‌కు ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. కర్నూలు జిల్లా కౌతాలం గ్రామం వీడీఓగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో పని చేశారు. ప్రస్తుతం ఆయన పీలేరు మండల డిప్యూటీ ఎంపీడీఓగానూ, పీలేరు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓగానూ కొనసాగుతున్నారు. పదోన్నతి లభించిన ఆయనను పంచాయతీ సిబ్బంది రెడ్డివరప్రసాద్, మంజుల, ఏపీ పంచాయతీ కార్మికుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య, నేతలు ముబారక్, వైఎస్ఆర్ మస్తాన్, అభినందించారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అడ్డుకోవడం, బాలికలపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీడీపీఓ నాగవేణి పేర్కొన్నారు. శనివారం కోటబడి మున్సిపల్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంకల్ప నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘వడ్డెర’ డైరెక్టర్‌గా శ్రీనివాసులు



మదనపల్లె టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వడ్డెర సంక్షేమం, అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా దేవరింటి శ్రీనివాసులును నియమిస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండల టీడీపీ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి చేసిన కృషిని గుర్తిస్తూ అధిష్ఠానం ఆయనకు ఈ పదవి కేటాయించింది. టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ్ అభినందించారు.